ప్రజాశక్తి
ఆదివారం 2 ఫిబ్రవరి 2025
8 పేజీలు

# ఎన్‌టిఆర్ కృష్ణా

# రిక్తహస్తం

- కేంద్ర బడ్జెట్లో పలు ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు నిల్
- విజయవాడ మెట్రో, తూర్పు బైపాస్, గుల్లలమోదలో మిస్సైల్ కేంద్రం ప్రస్తావన లేదు

**ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి, విజయవాడ**

2025-26 కేంద్ర బడ్జెట్ నిరాశ మిగిల్చింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో పెండింగ్‌లోని కేంద్ర ప్రాజెక్టులకు బడ్జెట్‌లో కేంద్రం మొండి చేయి చూపింది. పైసా నిధులు కూడా విదల్చలేదు. కృష్ణా జిల్లాలో మౌలిక వసతులకు సంబంధించి 216, 216 హెచ్ విస్తరణతోపాటు ఎన్‌టిఆర్ జిల్లాతోపటు కీలకమైన రాజధాని అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు, కృష్ణాజిల్లాలో భాగంగా ఉన్న తూర్పు బైపాస్‌లను పట్టించుకోలేదు. కృష్ణాజిల్లాలో గన్నవరం మండలం పెద్ద అవుటపల్లి నుంచి గోసాల, వణుకూరు, ఎన్‌టిఆర్ జిల్లా వైకుంఠపురం, కంచికచర్ల సమీపంలోని మున్నలూరు, తెలంగాణా సరిహద్దు ప్రాంతం పేత్రంపాడు, ఆగిరిపల్లి మండలం సగ్గరూ, కృష్ణాజిల్లాలో పొట్టిపాడు వరకు రాజధాని ఔటర్ రింగ్ రోడ్డుతోపాటు విజయవాడ తూర్పు బైపాస్‌లు నిర్మించాల్సి ఉంది. విజయవాడ సమీపంలోని నిడమనూరు నుంచి మహానాడు రోడ్డు వరకు ఆరు కిలో మీటర్లు ఫ్లైవోవర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. అయితే కేంద్ర బడ్జెట్‌లో వీటికి ఎటువంటి కేటాయింపులు చేయలేదు. పారిశ్రామిక వృద్ధికి దోహదపడే

చెన్నై-కోల్‌కతా పారిశ్రామిక కారిడార్, నాగాయలంక మండలం గుల్లలమోదలో మిస్సైల్ లాంఛింగ్ కేంద్ర నిర్మాణాలకు కూడా నిధులు కేటాయించలేదు. ఎన్‌టిఆర్ జిల్లాలో విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు డిపిఆర్ పూర్తయినా ప్రాజెక్టు ముందుకు తీసుకెళ్లడానికి నిధులు కేటాయించలేదు. 2028 వరకు జలజీవన్ మిషన్‌ను కొనసాగిస్తామని ప్రకటించడంతో ఉమ్మడి జిల్లాలో ఇంటింటికీ కుళాయి పథకాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అవకాశం ఏర్పడింది. రెండు జిల్లాల్లో రైల్వే ప్రాజెక్టులపై స్పష్టత రాలేదు.



## విపక్షాల మండిపాటు, మేలు చేస్తుందంటున్న కూటమి నేతలు

పలు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఒక్కపైసా నిధులు కూడా కేంద్ర బడ్జెట్లో కేటాయించలేదని విపక్షాల నేతలు మండిపడుతుండగా, రాష్ట్రాభివృద్ధికి ఈ బడ్జెట్ ఎంతో దోహదం చేస్తుందని టిడిపి కూటమి నేతలు చెబుతున్నారు.

### రాష్ట్రాభివృద్ధికి దోహదం
**నెట్టెం రఘురామ్, టిడిపి ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు**

కేంద్ర బడ్జెట్‌తో రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుంది. రాజధాని నిర్మాణానికి నిధుల కేటాయింపు దగ్గర నుంచి పోలవరం, విశాఖ స్టీల్‌ప్లాంట్, వ్యవసాయ, ఇతర పలుప్రాజెక్టులకు నిధుల కేటాయింపు జరిగింది. మన జిల్లాకు ప్రత్యేకించి కేటాయింపులు చూపించకపోయినా రాష్ట్రాభివృద్ధికి బడ్జెట్ దోహదపడుతుంది.

### నిరాశపరిచిన బడ్జెట్
**దేవినేని అవినాష్, వైసిపి ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు**

రాష్ట్ర ప్రజలను, ముఖ్యంగా ఈ జిల్లా ప్రజలను కేంద్ర బడ్జెట్ తీవ్ర నిరాశపరిచింది. రాష్ట్రానికే నిధులు కేటాయించలేదు. ఈ రాష్ట్రం నుంచి కూటమి ప్రభుత్వం తరుపున ఎన్నికైన ఎంపిలు ఘోరంగా విఫలమయ్యారు. పలు ప్రాజెక్టులు నిధులు కోసం ఎదురు చూస్తున్నాయి. రాజధాని నిర్మాణానికి కానీ, పోలవరంనకు నిధుల అరకొరగానే ఉన్నాయి. విజయవాడ మెట్రోకు నిధుల ఊసే లేదు.

### జలజీవన్ మిషన్ పనులకు కార్యాచరణ
**వి.బాలశౌరి, ఎంపి, మచిలీపట్నం**

అన్ని వర్గాలకు ప్రయోజనకరంగా ఉంది. ఆదాయ పన్ను స్లాబును రూ.12 లక్షలకు పెంచడం, ఇతర పన్ను పరిమితులను కొంత సడలించడంతో పలు వర్గాలకు ప్రయోజనం కలుగుతుంది. 2028 వరకు జలజీవన్ మిషన్‌ను కేంద్రం కొనసాగిస్తోంది. ఈలోపు కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో జలజీవన్ మిషన్ పనులు పూర్తి చేయడానికి కార్యాచరణ రూపొందిస్తాం.

### మరోసారి నిరాశ
**కె.ఎస్.లక్ష్మణరావు, పిడిఎఫ్ ఎంఎల్‌సి**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించిన కేంద్ర బడ్జెట్ ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి నిరాశను మిగిల్చింది. విభజన చట్టంలోని హామీల అమలుకు నిధులు కేటాయించలేదు. రాష్ట్రానికి కొత్త సంస్థలను కేటాయించలేదు. రాజధానికి ప్రపంచ బ్యాంక్ ఇచ్చే రుణం గ్రాంటుగా పేర్కొనలేదు. వ్యవసాయ రంగ పునరుజ్జీవనానికి తగిన చర్యలు ప్రకటించలేదు. ఉపాధిని పెంచేదిగా లేదు. విద్యుత్ రంగాన్ని, పట్టణ రంగాన్ని ప్రైవేటీకరించే దిశగా చర్యలు ప్రకటించారు. ప్రైవేటీకరణకు అన్ని రంగాల్లో పెద్దపీట వేశారు.

### రాష్టానికే దిక్కు లేదు...ఇక జిల్లాలకు ఎక్కడ
**డివి.కృష్ణ, వై.నరసింహారావు, సిపిఎం ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల కార్యదర్శులు**

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికే దిక్కులేనప్పుడు ఇక ఈ జిల్లాకు నిధులు కేటాయింపు ఎలా ఉంటుంది. రెండు జిల్లాల్లోని అనేక పెద్ద పెద్ద ప్రాజెక్టులు నిధుల సమస్యతో ఏళ్ల తరబడి అలాగే ఉన్నాయి. అటు కేంద్రం, ఇటు రాష్ట్రం పట్టించుకోవడం లేదు.

### తెలుగు ప్రజలను మోసం చేశారు
**దోనేపూడి శంకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి**

తెలుగు ప్రజలను బడ్జెట్ మోసం చేసింది. ఈ నగరానికి, జిల్లాకు నిధులు కేటాయింపు చేయలేదు. దీనిపై మోడీ, టిడిపి కూటమి ప్రభుత్వాలను నిలదీయాలి.

### సామాన్యునికి గొడ్డలి పెట్టు
**నరహరిశెట్టి నరసింహారావు, కాంగ్రెస్ నాయకులు**

సామాన్యునికి గొడ్డలి పెట్టులా ఉంది. తెలుగు ప్రజలను మరోసారి మోసం చేసేలా ఉంది. ఎపికి ప్రత్యేక హోదాపై మొండిచేయి చూపారు. వ్యవసాయం అనుబంధ సంఘాలకు నామ మాత్రపు కేటాయింపులు చేశారు.

### పన్ను మినహాయింపుతో ప్రయోజనం లేదు
**మామిడి మురళీకృష్ణ, ది కృష్ణాజిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ పూర్వ ప్రధాన కార్యదర్శి**

రూ.12 లక్షల వరకు ఇచ్చిన ఆదాయ పన్ను మినహాయింపుతో వ్యాపారులకు పెద్దగా ప్రయోజనం లేదు. రూ.12 లక్షలకు మించిన ఆదాయానికి మాత్రమే పన్నులు చెల్లించే విధంగా నిర్ణయం తీసుకుంటేనే వ్యాపారులకు, మధ్యతరగతి వర్గాలకు ప్రయోజనం చేకూరుతుంది.

### నూరుశాతం ఎఫ్‌డిఐ బిల్లు ఆమోదిస్తే సమ్మె : జి.కిషోర్ కుమార్, ఐసిఇయు మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి

బీమా రంగంలో నూరుశాతం ఎఫ్‌డిఐను తీసుకు వస్తామని ప్రకటించడం ఆందోళన కలిగిస్తోంది. ఇది దేశీయ పొదుపుపై విదేశీ సంస్థల పెత్తనం పెరగడానికి దారితీస్తుంది. పార్లమెంట్‌లో బిల్లు ఆమోదిస్తే వెంటనే దేశవ్యాప్తంగా ఒక గంట వాకౌట్ సమ్మెకు ఐసిఇయు పిలుపునిచ్చింది.

# 5న వైసిపి 'ఫీజుల పోరు'

## పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** విద్యార్థుల ఫీజుల కోసం ఈనెల ఐదో తేదీన వైసిపి ఆధ్వర్యాన జరిగే ఆందోళనా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ పిలుపునిచ్చారు. ఎన్‌టిఆర్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల వైసిపి సమన్వయకర్తల సమావేశం శనివారం దేవినేని అవినాష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా 'వైసిపి ఫీజుల పోరు' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ తల్లికి వందనం పేరుతో చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థుల జీవితాలు నాశనం అవుతున్నా కూటమి ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఈ నేపథ్యంలో ఫీజు పోరు కార్యక్రమంలో బీసెంట్ రోడ్డులోని వైసిపి కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి వినవిపత్రం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సిలు మొండితోక అరుణ్‌కుమార్, రుహుల్లా, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంఎల్‌ఎలు మల్లాది విష్ణు, మొండితోక జగన్మోనరావు, నల్లగట్ల స్వామిదాసు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, బెల్లం దుర్గ, నియోజకవర్గాల సమన్వయ కర్తలు తన్నీరు నాగేశ్వరరావు, సర్నాల తిరుపతిరావు యాదవ్‌తోపాటు నాయకులు పోతిన మహేష్ పాల్గొన్నారు.

# విషాదంలో గండ్రాయి

- ఐర్లాండ్ రోడ్డు ప్రమాదంలో పేట విద్యార్థి భార్గవ్ మృతి
- మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** ఉన్నత విద్యాభ్యాసం కోసం ఐర్లాండ్ దేశం వెళ్లి మత్యువాత పడిన చిట్టూరి భార్గవ్ స్వగ్రామం ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం గండ్రాయి గ్రామంలో విషాదం నెలకొంది. గండ్రాయి గ్రామంలో వ్యవసాయం లాభదాయకంగా లేకపోవడంతోపాటు తన పిల్లల చదువుల కోసం కొన్నేళ్ల క్రితం భార్గవ్ తండ్రి చిట్టూరి సాయిబాబా కుటుంబంతో సహా జగ్గయ్యపేట పట్టణం అయ్యప్పనగర్ వచ్చి నివాసం ఉంటున్నారు. ప్యూరిఫైడ్ వాటర్ పరికరాల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమారుడు భార్గవ్‌ను ఎంఎస్ కోసం మూడేళ్ల క్రితం ఐర్లాండ్ పంపారు. భార్గవ్ అక్కడే పార్ట్‌టైమ్ ఉద్యోగం చేసుకుంటూ ఎంఎస్ చదువుతున్నారు. చదువు కొద్ది నెలల్లో పూర్తి కానున్న నేపథ్యంలో ఉద్యోగ ప్రయత్నాలు కూడా చేసుకుంటున్నారు. అయితే ఐర్లాండ్‌లో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్గవ్

(మిగతా 2లో)

నెల్లూరులో శనివారం ప్రారంభమైన సిపిఎం రాష్ట్ర మహాసభలో చర్చలు జరుపుతున్న ఎన్‌టిఆర్ జిల్లా ప్రతినిధులు; (కింద వరుసగా) మహాసభలో చర్చలపై మాట్లాడుతున్న సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదల వెంకటేశ్వరరావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.సిహెచ్.శ్రీనివాస్, జిల్లా నాయకులు పి.కృష్ణ

## రెండు సినిమా థియేటర్లపై చర్యలు

**ప్రజాశక్తి - విస్సన్నపేట :** ఎన్‌టిఆర్ జిల్లా విసన్నపేటలోని రెండు సినిమా థియేటర్లపై ఆర్‌డిఒ కె.మాధురి చర్యలు తీసుకున్నారు. శ్రీరామ్ థియేటర్, వెంకటేశ్వర థియేటర్‌ను ఆమె శనివారం పరిశీలించారు. ప్రస్తుతం శ్రీరామ్ థియేటర్లో 'సంక్రాంతికి వస్తున్నాం', వెంకటేశ్వర థియేటర్లో 'డాకూ మహారాజ్' సినిమాలు ప్రదర్శితమవుతున్నాయి. సరియైన పత్రాలు లేకపోవడం, నియమ నిబంధనలు పాటించిన కారణంగా రెండు థియేటర్లలో ప్రదర్శనలను నిలిపివేస్తూ చర్యలు తీసుకున్నారు. లైసెన్స్ పత్రాలు చూపే వరకు ప్రదర్శనలు వేయకుండా నిలిపి చేయాలని మండల తహశీల్దారు కె.లక్ష్మీ కళ్యాణిని ఆర్‌డిఒ కె.మాధురి ఆదేశించారు.

## పింఛన్ల పంపిణీ పరిశీలన

**ప్రజాశక్తి - విజయవాడ :** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం 18వ డివిజన్ వాటర్‌ట్యాంక్ రోడ్, రాణి గారి తోట ప్రాంతాల్లో పర్యటించారు. లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. స్వయంగా లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవి జీ ఎస్ వి ప్రసాద్, ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, జాయింట్ డైరెక్టర్ అమత్ డాక్టర్ లత, సూపరిండెంటింగ్ ఇంజనీర్ (వర్క్స్) పి. సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు

### ఎస్‌సి వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ మిశ్రా

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉందని ఎస్‌సి వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా అన్నారు. స్థానిక పటమట కోనేరు బసవయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన... విద్యాశాఖ అధికారులతో కలిసి పదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పాఠ్యాంశాలపై విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాన్ని పరీక్షించారు. త్వరలో జరిగే పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధులను చేయాలని, పాఠ్యాంశాలపై పట్టు సాధించేదిశగా వారిని తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. సబ్జెక్టుల వారీగా అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించాలని, వైయక్తిక భేదాలను అనుసరించి విద్యార్థులపై శ్రద్ధచూపి ప్రత్యేకంగా బోధించాలన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దష్టిపెట్టాలని, పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించే దిశగా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. చైర్మన్ వెంట పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు, జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ, అడిషనల్ డైరెక్టర్లు మధుసూదన్ రావు, శ్రీనివాసరెడ్డి, డీఈవో యు.వి.సుబ్బారావు ఉన్నారు.

## విషాదంలో గండ్రాయి

(మొదటి పేజీ తరువాయి)

మృత్యువాతపడ్డారు. చేతికి అందివచ్చిన బిడ్డ రోడ్డు ప్రమాదంలో మరణించడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కుటుంబానికి ఆసరాగా ఉంటాడనుకున్న తరుణంలో ఇలా జరగడం ఆ కుటుంబాన్ని కలిచివేస్తోంది.

**నెట్టెం, శ్రీరాం రాజగోపాల్ పరామర్శ మృతదేహాన్ని స్వగ్రామం తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు**

ఉన్నత విద్య కోసం ఐర్లాండ్ దేశం వెళ్లి దురదష్టవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురైన చిట్టూరి భార్గవ్ కుటుంబ సభ్యులను జగ్గయ్యపేటలోని వారి స్వగృహంలో టిడిపి ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్, జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈసందర్భంగా రఘురామ్ మాట్లాడుతూ ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న భార్గవ్... అతి త్వరలో ఎంఎస్ పూర్తిచేసుకుని ఉద్యోగం కూడా పొందే సమయంలో రోడ్డు ప్రమాదంలో మరణించడం తీవ్రంగా కలచివేసిందన్నారు. భౌతికకాయాన్ని త్వరగా స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు ఈ విషయాన్ని మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. లోకేష్ వెంటనే స్పందించి భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించి కావాల్సిన ఏర్పాట్లు చేశారని తెలిపారు.

**రోడ్డు ప్రమాదంలో భార్గవ్ మృతి**

ఉన్నత చదువుల కోసం ఐర్లాండ్ వెళ్లిన చిట్టూరి భార్గవ్ (24) శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. కార్గో పట్టణంలో సౌత్ ఈస్ట్ టెక్నాలజికల్ యూనివర్సిటీలో చదువు నిమిత్తం మూడేళ్ల క్రితం అక్కడికి వెళ్లాడు. పల్నాడు జిల్లా రొంపిచర్ల పడమటి పాలేనికి చెందిన చెరుకూరి సురేష్ (25), మరో ఇద్దరితో కలిసి చిట్టూరి భార్గవ్ కారులో ట్రిప్‌కు వెళ్తుండగా రాతో అనే ప్రాంతంలో రోడ్డు ప్రమాదం జరిగింది. భారీగా మంచు కురవడంతో అదుపుతప్పిన కారు చెట్టును ఢీకొట్టింది. దీంతో కారు పక్కనే ఉన్న లోయలో పడిపోయింది. ఈఘటనలో భార్గవ్, సురేష్ సంఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోగా, మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. రైతు కుటుంబం నుంచి వచ్చి ఉన్నత విద్య చదవాలని ఐర్లాండ్ వెళ్లిన భార్గవ్ రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడంతో గండ్రాయి గ్రామంలో విషాదం నెలకొంది.

## వెనుకబాటుతనం ఆధారంగా ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయాలి : వేమన

**ప్రజాశక్తి - విజయవాడ :** దళితుల్లో అట్టడుగున ఉన్న వ్యక్తి మొదటిగా ప్రయోజనం పొందగలిగినప్పుడే సామాజిక వెనుకబాటుతనం ఆధారంగా లభించిన రిజర్వేషన్లతో అసలు ప్రయోజనం నెరవేరుతుందని సామాజిక న్యాయ సాధన వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.ఆర్. వేమన అన్నారు. విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల అమలయ్యే క్రమంలో ఎత్తుపల్లాలు సహజంగా ఏర్పడినవేనని అన్నారు. రిజర్వేషన్ల అమలులో ఏర్పడిన అంతరాలను సరిచేయడం అందరి కర్తవ్యం కావాలని అన్నారు.

## నిష్పక్షపాతంగా ఎంఎల్‌సి ఎన్నికలు : కలెక్టర్ లక్ష్మీశ

**ప్రజాశక్తి - విజయవాడ :** ఉమ్మడి కృష్ణా–గుంటూరు జిల్లాల శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలను నిష్పక్షపాతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ.. ఎమ్మెల్సీ ఎన్నికలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. ఈ నెల 3న నోటిఫికేషన్ జారీ అవుతుందని, ఫిబ్రవరి 10 వరకు అభ్యర్థులు నామినేషన్లు వేయొచ్చని తెలిపారు.

---

**మహారాజశ్రీ గన్నవరం అదనపు సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో**
**O.S. 76/2024**

Between:
పుట్టి వెంకటప్పయ్య ....వాది
మరియు
పఠాన్ హిమామ్ బి అండ్ ఇద్దరు .... ప్రతివాదులు
ప్రతివాది నెం.2 :
పఠాన్ నాసర్‌జాని, తండ్రి : లాలు (లేటు), ముస్లిమ్, అల్లాపురం గ్రామం, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా.
ప్రతివాది నెం.3 : మొగల్ నజీరా బేగం, భర్త : కాకాని బాజి, తండ్రి : (లేటు) లాలు, ముస్లిమ్, అల్లాపురం గ్రామం, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా.

పై నెంబరు దావాలో మీకు (2,3 ప్రతివాదులు) శ్రీ కోర్టుద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు సమన్లు చేయించినను మీరు (2,3 ప్రతివాదులు) తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు 2, 3 ప్రతివాదులకు ఈ పేపరు ప్రకటన ద్వారా సమన్లు చేయించవలసినదిగా పై కోర్టువారు ఆర్డరు చేస్తూ ది. 10-2-2025 తేదీకి వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట మీరు 2, 3 ప్రతివాదులు స్వయంగా గానీ, లేదా మీ న్యాయవాది ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేసుకొన వలసి యున్నది. లేనిచో మీ పరోక్షమున తీర్మానం చేయబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

( శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 10-2-2025

ఇట్లు
టి.వెంకయ్య,
వాది తరపు అడ్వకేట్, గన్నవరం
సెల్ : 7386568299

---

**IN THE COURT OF HON'BLE III ADDL. DISTRICT JUDGE RANGAREDY DISTRICT AT :: L.B.NAGAR**
**E.P. NO: 108 of 2024**

BETWEEN:
RAMOJU SUNIL
...Decree Holder
AND
SMT MADHAVI CHERUKURI
W/O. N.V.S.R. Naidu
...Judgment Debtor

To,
Smt. Madhavi Cherukuri, W/o. NSVR Naidu, Aged about 45 years, Occ: Business, R/o. 56-5-1/1, Ramineni Street, High School Road, Patamata, Vijaywada, Vijaywada (URBAN), Venkateswarapuram, Krishna District, Andhra Pradesh 520 010. Ph: 8500310217

Please take notice that the Decree Holder filed the above Execution Petition on the Judgment and Decree passed by the Hon'ble III ADDL.DISTRICT JUDGE, R.R.DIST COURT AT L.B.NAGAR in MVOP 450/2018 Hon'ble Court adjourned the matter to 25.02.2025 and you are hereby directed to appear before the Hon'ble III ADDL.DISTRICT JUDGE, R.R.DIST COURT AT L.B.NAGAR at 10.30 A.M either in person or through an advocate on 25.02.2025 at 10:30 AM, failing which the matter will be decided in your absence.

**BY ORDER OF THE COURT**
M/s Ravi Chandra.B (AP/1027/2016)
Advocates.
Address: # 504, Golden Green Apartments, Erramanzil Colony, Panjagutta, Hyderabad - 82
9703072729
ravichandraadvocate@gmail.com

---

**మహారాజశ్రీ 16వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టు నందిగామ**
**Gwop:-79/2024**

Between:
పిన్నెల్లి కోటేశ్వరి ... పిటిషనర్
మరియు
Nill ... రెస్పాండెంట్స్

పై నంబరు పిటిషన్ లో పిటిషనర్ అయిన పిన్నెల్లి కోటేశ్వరి, పిన్నెల్లి అక్షయ్ కు గార్డియన్ గా ఉంటూ పిటిషన్ దాఖలు చేసియున్నారు. పిన్నెల్లి అక్షయ్ తండ్రి మౌళేశ్వరరావు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ లో పాలసీ తీసుకొనగా మౌళేశ్వరరావు గారు చనిపోయినారు. కనుక శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ తాలూకా రూ. 10,00,000/- (అక్షరాల పది లక్షల రూపాయిలు) శ్రీ రామ లైఫ్ ఇన్సూరెన్స్ డబ్బులు తీసుకొనుటకు అక్షయ్ తరుపున తల్లి దండ్రులు ఇద్దరు చనిపోయారు. అక్షయ్ మైనర్ అయినందున గార్డియన్‌గా పిన్నెల్లి కోటేశ్వరి, పిన్నెల్లి అక్షయ్ యొక్క ఖర్చులు స్కూల్ ఫీజులు, పోషణ కాలేజీ ఫీజులు వగైరాలు నిమిత్తం డ్రా చేసుకొనుటకు policy amount ని పర్మిషన్ ఇప్పించమని కోరుతూ పిటిషనర్ పై నంబరు పిటిషన్ పై నంబరు పిటిషన్ దాఖలు చేసినారు. పై నంబరు పిటిషన్ లో ఎవరికైనా అభ్యంతరాలు, ఆక్షేపణలు తెలియ పరచుటకు తెలియజేయువారు. ది. 6/ 2/2025న ఉదయం గం, 10.30 ని. లకు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై వారి ఆక్షేపణలు తెలియపరచ వలెను. లేని యెడల పరోక్ష మందు తీర్మానించబడునని ఇందు మూలంగా తెలియజేయటమైనది.

ఇట్లు
దర్శి అర్జున్,
వేల్పుల ప్రభాకరరావు,
పి.ఎల్.ప్రదీప్ కుమార్,
న్యాయవాదులు, నందిగామ

నందిగామ
ది. 25/01/2025.

---

**IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISON) AT AVANIGADDA**
**O.S. No. 117/2016**

Between:
Yalavarthi Arjunarao and 5 others
... Plaintiffs
Vs
Repalle Nageswara Rao (Died)
and 21 others .... Defendents

**To,**
**D22 :** Yalavarthi Sai kumar, S/o Late AtmaJaya ram, in the aged about 25 years, Proparties R/o at Present 3rd Ward, near Gurrappa Cheruvu, Avanigadda Village and Mandal, Krishna District.

పై నెంబరు గల దావాలో 22వ ప్రతివాది అయిన మీకు దావా సమను నిమిత్తం చివరి సారిగా ది. 7-2-2025 నాడు వాయిదా అయివున్నది. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు పై కోర్టు నందు మీరు స్వయంగా గానీ లేదా మీ తరఫు ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియపరచ గలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించెదరు. శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం దావా సమన్లు ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు అమలు పరచటమైనది.

(పై కోర్టు ఉత్తర్వుల మేరకు)
వాయిదా : 7-2-2025
అవనిగడ్డ
తేది:1-2-2025

ఇట్లు
సనకా రఘురామప్రసాద్, బి.కాం., బి.ఎల్.,
న్యాయవాది, అవనిగడ్డ.
సెల్ : 9949988835.

---

# శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం

**పెనుగంచిప్రోలు, యన్.టి.ఆర్.జిల్లా.**

**ఇ- ప్రొక్యూర్‌మెంట్-కం-షార్ట్ టెండర్-కం-బహిరంగ వేలము ప్రకటన (3వ పర్యాయము)**
**Computer No.76867/2024 Dt.01.02.2025 (License Bid Amounts must be exclusive of all taxes)**
**సంవత్సరములో దేవస్థానముతో 20 లక్షలకు పైబడి లావాదేవీలు జరిపిన యెడల GST Registration తప్పని సరి.**

| వ.నెం. | ప్రక్రియ | ది.01.4.2025 నుండి ది.31.3.2026 వరకు గల కాలపరిమితికి లైసెన్స్ హక్కు (డిపాజిట్) ల వివరము |
|---|---|---|
| 1. | ఇ-ప్రొక్యూర్‌మెంట్-కం- టెండర్ - కం- బహిరంగ వేలము (5 నెం) www.apeprocurement.gov.in 05.02.2025 నుండి అందుబాటులో ఉండును. | 1) కొబ్బరి కాయలు విక్రయము: 10 లక్షలు<br>2) పొంగలి షెడ్ల ఉన్నవి ఉన్నట్లుగా నిర్వహణ 5 లక్షలు<br>3) మట్టి కుండలు విక్రయము :5 లక్షలు<br>4)ఫొటోలు తీసుకొనుట నిర్వహణ: 5లక్షలు<br>5) సెల్ ఫోన్ లు భద్రపరచుకొనుట: 5లక్షలు |
| 2. | టెండర్ - కం- బహిరంగ వేలము (4 నెం.) | 1) పప్పులు, పాలు, బియ్యం వగైరాలు వసూలు:25 వేలు<br>2) చాపలు అద్దెకు ఇచ్చుట :10 వేలు<br>3) భక్తుల సామాన్లు, పాదరక్షలు భద్రపరచుట: 25 వేలు<br>4) సులభా కాంప్లెక్స్ నిర్వహణ: 25 వేలు |

1) పాటదారులు (ఆధార్, పాన్ మరియు వృత్తి పన్ను సర్టిఫికెట్ తప్పనిసరి) ధరావత్తు సొమ్మును కార్యనిర్వహణాధికారి, శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం, పెనుగంచిప్రోలు వారు పేరున డి.డి రూపములో మాత్రమే చెల్లించవలెను. నగదు స్వీకరించబడదు.
2) హెచ్చుపాట దారులు పాట ముగిసిన వెంటనే G.O.M.S.No.426 ప్రకారం హెచ్చుపాట మొత్తం GST తో కలిపి బ్యాంకు ద్వారా చెల్లించవలెను. నగదు స్వీకరించబడదు. అట్లు చెల్లించని యెడల ఎటువంటి నోటీసు లేకుండా ధరావత్తు సొమ్మును దేవస్థానం నిధులకు జమ చేసి తిరిగి బహిరంగ వేలము నిర్వహించబడును.
3) వ.నెం.1&2 నకు సంబంధించి బహిరంగ వేలము తేది.20.02.2025 ఉ.గం.11.15ల నుండి టెండర్ షెడ్యూల్ ఖరీదు రూ.1000+ GST రూ. 180/-బీ టెండర్ షెడ్యూల్ విక్రయము ది.05.02.2025 నుండి ది.19.02.2025 వరకు, టెండర్ దాఖలు తేది:20.02.2025 ఉదయం గం.11.00 లోపు, బహిరంగ వేలము తదుపరి టెండర్ బాక్సు తెరువబడును.

| | | |
|---|---|---|
| 3. | సీల్డ్ టెండర్ | ది.01.04.2025 నుండి ది.31.03.2026 వరకు పాలుమజ్జిగ, పెరుగు, చేయుటకు సీల్డ్ టెండర్, సరఫరా (డిపాజిట్ 10 వేలు) |
| 4 | సీల్డ్ టెండర్ | ది.01.04.2025 నుండి ది.31.03.2026 వరకు దేవస్థానము నకు అవసరమగు కూరగాయలు పండ్లు,రోజువారీ రైతు బజార్ రేటు పై కేజీ ఉచిత )కి డిస్కౌంట్ శాతము 1 (రవాణా తోసరఫరా టెండర్ (డిపాజిట్ 10 వేలు) |
| 5 | సీల్డ్ టెండర్ | ఖాళీ నూనె/జీడిపప్పు డబ్బాలు తీసుకువెళ్ళుట (డిపాజిట్ 5 వేలు) |
| 6 | సీల్డ్ టెండర్ | కండువా దేవస్థానం పేరు/శ్లోకం తో 160×10సెం.మీ, 80 సెం.మీ. రూబీ జాకెట్ ముక్కలు (మీడియం క్వాలిటీ), పట్టు చీరెలు, పంచెలు యితర వస్త్రముల సరఫరా (డిపాజిట్ 50 వేలు) |
| 7 | **మిగిలిన షాపులు: (2వ పర్యాయము)**<br>ది.01.04.2025 నుండి ది.31.03.2027 వరకు<br>అనగా 2 సంవత్సరముల కాల పరిమితికి **బహిరంగ వేలము తేది.21.02.2025** | 1) దేవస్థానం ప్రాంగణం, క్యాంటిన్ ప్రక్కన గల షాపులు 19 నెం, **ధరావత్తు** రూ.20,000/- (షాపు ఒక్కింటికి)<br>2)హోమగుండం వైపు షాపులు 3 నెం. **ధరావత్తు** రూ.10,000/- (షాపు ఒక్కింటికి)<br>3)మున్నేరు దారి వెంబడి షాపులు 12 నెం. **ధరావత్తు** రూ.20,000/- (షాపు ఒక్కింటికి)<br>4) సంచారముగా 5 సోడా బండ్లు ఏర్పాటు **ధరావత్తు** రూ.10,000 (షాపు ఒక్కింటికి) |

వ.నెం.3 నుండి 6 వరకు టెండర్ షెడ్యూల్స్ జారీ తేది.05.02.2025 నుండి ది.21.02.2025 వరకు, టెండర్ దాఖలు తేది.21.02.2025 ఉదయం గం.11.00 వరకు. అదే రోజు ఉ.గం 11.15నిల తరువాత హాజరైన టెండర్ దారుల సమక్షంలో టెండర్ బాక్సు తెరువబడును. మిగిలిన వివరములు దేవస్థాన కార్యాలయ పనివేళలలో సంప్రదించగలరు.

శ్రీ అమ్మవారి సేవలో

**శ్రీ జంగాల శ్రీనివాసరావు**
**చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు**

**బిహెచ్.వి.యస్.యన్. కిషోర్ కుమార్**
**డిప్యూటీ కమీషనర్ మరియు కార్యనిర్వహణాధికారి**

## చెరువు వెంబడి పిచ్చిచెట్లు తొలగింపు

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మంచినీటి ఎద్దడిని నివారించేందుకు కాలువ నుండి మంచినీటి చెరువుకు నీరు వెళ్లే బోధను శనివారం జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. మండల కేంద్రమైన గుడ్లవల్లేరులో స్పెషల్ ఆఫీసర్ టీ విజయ సారధి, పంచాయతీ కార్యదర్శి నరసింహారావు పర్యవేక్షణలో గ్రామ ప్రజలు ఇలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అనేక పారిశుధ్య పనులను చేపట్టారు. మంచినీటి చెరువుకు వెళ్లే బోదు తోడు, చెట్లతో నిండిపోగా వాటిని తొలగించారు. రోడ్లు వెంబడి ఎత్తను, మురికి బోదులలోని మురికి మట్టిని పారిశుధ్య కార్మికులచే శుభ్రపరిచారు.

## వేగ నియంత్రణ బోర్డులు ఏర్పాటు

**ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ (గన్నవరం) :** అప్పన వీడు హైస్కూలు పూర్వ విద్యార్థి మొవ్వా రమేష్ , రంగ లక్ష్మి దంపతులు 15, 000 వేల రూపాయలు వితరణతో రోడ్‌కు రెండు వైపులా వేగ నియంత్రణ సూచికలు ఏర్పాటు చేశారు. వాటిని పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయిని తోట పుష్పవతి తో కలిసి శనివారం ప్రారంభించారు. దాతలను ఉపాధ్యాయులు ఉపాధ్యాయతర సిబ్బంది విద్యార్థులు అభినందించారు. పాఠశాల అభివద్ధికి మరింత ఆర్థిక సహకారాన్ని అందిస్తానని దాత తెలిపారని మారు బోయిన కోటేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది బాబి , నాగేశ్వరరావు, రామకష్ణ , దిల్దార్ బేగం , మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

## పింఛన్లు పంపిణీ

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద 93.76 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో టి విజయ సారధి తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయా పంచాయతీ కార్యదర్శులు, ఏజెఎల్ నరసింహారావు, వి. ఎలీషా రావు, కరిముల్లా, విజయ్, వెంకటేశ్వరరావు రాజేష్ సచివాల సిబ్బంది ద్వారా ఉదయం నుండి లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీ చేసినట్లు తెలిపారు.

# పాఠశాలల విలీనం ఆపాలని ధర్నా

ఆందోళన చేస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండల కేంద్రమైన గుడ్లవల్లేరు అంబేద్కర్ నగర్, ఎన్‌టిఆర్ కాలనీ,జగనన్న కాలనీల పరిధిలోని 1000 కుటుంబాలకు అందు బాటులో వున్న అంబేత్కర్ నగర్ ప్రాథమిక పాఠశాలను, లంకమలపల్లి పాఠశాలలో విలీనం ప్రతిపాదనలను వెంటనే ఆపాలని సిపిఎం, స్కూల్స్ కమిటీల ఆధ్వర్యంలో స్కూల్ ఎదుట ధర్నా నిర్వహించారు. మండలంలోని మొత్తం 65 స్కూల్స్‌లో, 31 స్కూల్స్, 34 స్కూల్స్ తరగతులు విలీనం చేసి 500 మంది పిల్లలను ప్రాథమిక విద్యకు దూరం చేసే ప్రతిపాదనలు ఆపాలని పలువురు కోరారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా సిపిఎం గుడ్లవల్లేరు మండల భాద్యులు బి. వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్య ప్రవేటీకారణ కార్పొరేటీకరణ, కాషాయీరణలో భాగంగా ఈ విలీనం ప్రక్రియ చేపట్టడం సిగ్గు చేటన్నారు. మండలంలోని 34 స్కూల్స్ పేరెంట్స్ ను సమీకరించి వందలాది మందితో త్వరలో మండల విద్య శాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ పరిరక్షణ కమిటీ అధ్యక్షురాలు కొడాలి శిరీష, కార్యదర్శి జజ్జవరపు దుర్గ, కమిటీ సభ్యులు గుంటూరు సుందరి, వీరంకి కష్ణమ్మ,కాటూరి వాణి, రాయళ్ల రాణి,ఆలూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# బస్సు సర్వీసు పునరుద్ధరించాలని వినతి

వినతిపత్రం అందిస్తున్న బడే గౌతమ్

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** నాగాయలంక-నరసాపురం బస్సు సర్వీసును తిరిగి ప్రారంభించాలని వైసిపి యువ నేత బడే గౌతమ్ అవనిగడ్డ డిపో మేనేజర్ కే హనుమంతరావుకు వినతి పత్రం అందజేశారు. శనివారం డిపో కార్యాలయంలో మేనేజర్‌ను కలసి గతంలో డిపో నుండి నడిపిన బస్సు సర్వీసు నాగాయలంక వాసులకు పరిసర ప్రాంత వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది అన్నారు. కానీ ఇటీవల ఆ బస్సు సర్వీసును నిలిపివేయడం వలన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. అందువల్ల ఈ ప్రాంత వాసులకు ఎంతో ఉపయోగకరమైన నాగాయలంక నరసాపురం బస్ సర్వీసును తిరిగి ప్రారంభించాలని కోరారు.

**సర్పంచ్‌కు పరామర్శ**

మండల పరిధిలోని దక్షిణ చిరు ఓలులంక గ్రామ సర్పంచ్ స నకా సుబ్రహ్మణ్యం అనారోగ్యానికి గురికాగా ఆయనను బడే గౌతమ్ పరామర్శించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం ఆరోగ్య పరిస్థితిని యోగక్షేమాలను గౌతం అడిగి తెలుసుకున్నారు

## రోగులకు వైద్య పరీక్షలు

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సి.ఎల్ వెంకటరావు ఆధ్వర్యంలో గుడ్డవల్లేరులోని జన్మభూమి మెడికల్ క్యాంపులో శనివారం వందలాది మంది రోగులకు వివిధ రుగ్మతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏలూరు సెయింట్ జోసెఫ్ డెంటల్ వారి వైద్యులు రోగులకు దంత వైద్య పరీక్షలు చేశారు. విజయవాడ సివిఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి వైద్యులు రోగులకు గుండె పరీక్షలు చేశారు. మచిలీపట్నం నాగమణి రెటీనా ఇన్స్టిట్యూట్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ వైద్యులు డాక్టర్ పవన్ కుమార్ గొరిపర్తి వైద్య బందంచే నేత్ర వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కళ్ళజోళకు సిఫారసు చేశారు. అవసరమైన రోగులకు ఉచిత మందులు పంపిణీ చేపట్టారు. అలాగే ఆదివారం విజయవాడ కామినేని హాస్పిటల్ వారు, హెూమియో వైద్యులు, ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వారు తమ వైద్య శిబిరంలో వైద్య సేవలు అందించనున్నారని డాక్టర్ సి ఎల్ వెంకటరావు పేర్కొన్నారు.

పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

## సలంబం ఫెడరేషన్ పోటీలకు కెకెఆర్ విద్యార్థి ఎంపిక

**ప్రజాశక్తి - గుడివాడ :** తమిళనాడులోని కన్యా కుమారిలో జరిగే ఆల్ ఇండియా సలంబం ఫెడరేషన్ చాంపియన్‌షిప్ పోటీలకు స్థానిక డా.కెకెఆర్స్ గౌతమ్ విద్యార్థి బి.కార్తీకేయ అర్హత సాధించి ప్రతిభ చాటినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక పాఠశాల ఆవరణలో విద్యార్థి కార్తీకేయను ఆయన అభినందించారు. విద్యార్థి కార్తీకేయ, కోచ్ ఎన్.వెంకటేశ్వరరావులను ప్రిన్సిపాల్స్ సత్మారామ్, జ్యోతి, ప్రశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

## కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించొచ్చు : డిఎస్‌పి

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** విద్యార్థుల్లో పట్టుదల కృషి ఉంటే ఎంతటి విజయాన్ని అయినా సాధించవచ్చునని అవనిగడ్డ డిఎస్‌పి విద్యాశ్రీ అన్నారు. శనివారం ఎస్ వి ఎల్ క్రాంతి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదివే విద్యార్థులు సీనియర్ ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డి.ఎస్.పి మాట్లాడుతూ ఇంటర్లో 90 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు ఢిల్లీ యూనివర్సిటీలో చదువుకునే అవకా శాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు మంచిగా చదువుకొని భవిష్యత్తులో గొప్పగా స్థిరపడాలని ఆకాంక్షించారు. కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహే శ్వరరావు మాట్లాడుతూ మార్చిలో జరిగే ఇంటర్ పరీక్షలలో అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులై కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్వి నాగేశ్వరరావు, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం : సిపిఎం

**ప్రజాశక్తి-చల్లపల్లి :** కాలనీ ఏర్పడి మూడు దశాబ్దాలు కావస్తున్నా నేటి వరకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమయ్యిందని సిపిఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 1995 సంవత్సరం నుంచి నారాయణరావునగర్‌లో 200 మంది దళిత, గిరిజన, ముస్లిం కుటుంబాలకు చెందినవారు ఆవాసాలు ఏర్పాటుకుని నివాసాలు ఉంటున్నారన్నారు. కానీ కాలనీలో ఎటువంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయలేదని, కాలనీలో ఐదు మట్టి రోడ్లు తప్ప ఒక సిమెంటు రోడ్లు వేయలేదని అన్నారు. కనీసం తాగునీరు సైతం అందటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పిల్లలు వద్దులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాగే కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మాణం జరిగితే ఏవైనా కార్యక్రమాలు జరుపుకునేందుకు అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

# నోబుల్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

మాట్లాడుతున్న జడ్జి

**ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ :** మచిలీపట్నంలోని స్థానిక నోబుల్ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ జె ఎర్నెస్ట్ అధ్యక్షతన శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా పి డి ఎం కోర్టు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి,రెండవ ఎడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ దీపిక ముఖ్య వక్తలు గా వ్యవహరించారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ యువతకు చట్టాలపై అవగాహన ఎంతైనా అవసరమని అన్నారు. బాలికలకు, బాలురకు పోక్సో చట్టం గురించి వివరించారు. ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. ముఖ్యంగా బాలికలు స్నేహాలు విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఉదాహరణలతో వివరించారు. ఈ సదస్సులో డి ఎల్ ఎస్ ఎ మెంబర్ లాయర్ సి హెచ్ ముసలయ్య, మచిలీపట్నం ఏ ఎస్ ఐ ప్రభాకర్, నోబుల్ కలాశాల అధ్యాపకులు సి హెచ్ శాలిని, పాల్ సుధాకర్, కోటేశ్వరరావు,చిత్తరంజన్ దాస్,సిబ్బంది, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# సజావుగా పెన్షన్ల పంపిణీ : కలెక్టర్, కమిషనర్

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :** రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని దృష్టిలో ఉంచుకొని పటిష్ట పర్యవేక్షణతో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ ప్రక్రియను సజావుగా చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డి.జి.లక్ష్మీశ అన్నారు. ఎన్టీఆర్ భరోసా ద్వారా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీలో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ లక్ష్మీశ కంచికచర్ల మండలంలోని పరిటాల, ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులో పర్యటించారు. ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ఇంటింటికి వెళ్లి పెన్షన్లు అందిస్తున్న ప్రక్రియను పరిశీలించారు. శనివారం ఉదయం 6 గంటలకు పంపిణీని ప్రారంభించి, మొదటిరోజే జిల్లాలో 2,29,913 పెన్షన్లకు రూ.98.20 కోట్లు పంపిణీని పూర్తిచేసేందుకు కృషిచేయడం జరిగిందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అధికారుల పర్యవేక్షణతో ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా లబ్ధిదారులకు పెన్షన్లు అందించడం జరిగిందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. పెన్షన్ల పంపిణీని పరిశీలించిన అనంతరం మూలపాడు గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. తడిచెత్త, పొడిచెత్తను విడివిడిగా సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. క్షేత్రస్థాయి పర్యటనలో కలెక్టర్ వెంట డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, నందిగామ ఆర్‌డీవో కె.బాలకష్ణ, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు. **విజయవాడ :** విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో పెన్షన్ల పంపిణీలను సత్వరమే పూర్తి చేయాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శనివారం ఉదయం 18వ డివిజన్ వాటర్ ట్యాంక్ రోడ్, రాణి గారి తోట ప్రాంతాల్లో పర్యటించి పెన్షన్ లబ్ధిదారులకు స్వయంగా తామే ఆధార్ కార్డు, రియల్ టైం బెనిఫిషరీ ఐడెంటిఫికేషన్ సిస్టం యాప్‌లో పరిశీలించి పెన్షన్ నగదు అందజేశారు. వారితో మాట్లాడి ప్రతి నెల సరైన సమయానికి పెన్షన్ అందుతుందా లేదా, ఎంత పెన్షన్ అందుతుంది వంటి విషయాలపై ఆరా తీశారు. తదుపరి ఇంజనీరింగ్ సిబ్బంది వారు చేస్తున్న తాగునీటి పరీక్షను పరిశీలించారు. అందులో ఉన్న క్లోరిన్ శాతాన్ని పరిశీలించి, ప్రతిరోజు జరుగుతున్న తాగునీటి పరీక్షను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజలకు నిత్యం పరిశుభ్రమైన తాగునీరుని అందజేసేలా చూసుకోవాలన్నారు. అధికారుల పర్యటనలో ఎప్పటికప్పుడు డ్రైన్ క్రాసింగ్‌ని పరిశీలిస్తూ ఉండాలన్నారు. తదుపరి రాణి గారి తోటలోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించి, కిచెన్ శుభ్రత ఆహార నాణ్యత మరుగుదొడ్ల నిర్వహణ ఎప్పటికప్పుడు చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జివిజిఎస్‌వి.ప్రసాద్, ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, జాయింట్ డైరెక్టర్ అమృత్, డాక్టర్ లత, సూపరిండెంటింగ్ ఇంజనీర్ (వర్క్స్) పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

విజయవాడలో పెన్షన్ల పంపిణీలో పాల్గొన్న విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

## గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాశక్తి - మైలవరం :** స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో గెస్ట్ లెక్చరర్‌గా పని చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ ఈల్లా రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కనీసం 55 శాతం మార్కుల్లో కంప్యూటర్ సైన్స్‌లో పిజి పాసై ఉండాలన్నారు. ఏపీ సెట్ యుజిసి నెట్ పిహెచ్‌డి అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడునన్నారు. సెలెక్ట్ అయిన అభ్యర్థులకు గరిష్టంగా నెలకు రూ.14,500 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు బయోడేటాతో పాటు క్వాలిఫికేషన్ సర్టిఫికెట్లను జత చేసుకుని ఈనెల మూడో తేదీ ఉదయం 10 గంటలకు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి డిగ్రీ కళాశాలలో జరిగే వాకింగ్ ఇంటర్వ్యూలకు హాజరవ్వాలన్నారు. ఇతర వివరాలకు నెంబరును 9959108829 సంప్రదించాలన్నారు.

మైలవరం ఎల్‌బిఆర్‌సిఇలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

## రక్తదానం ప్రాణదానంతో సమానం

**ప్రజాశక్తి - మైలవరం :** రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎల్‌బిఆర్‌సిఈ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.అప్పారావు అన్నారు. ఎల్‌బిఆర్‌సిఇ కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్, రెడ్ క్రాస్ సొసైటీ సౌజన్యంతో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతులుగా ఉన్న యువతీ యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 65 మంది విద్యార్థులు రక్తదానం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.మదన్మోహన్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి.శివ హరిప్రసాద్, ఇండియన్ రెడ్ క్రాస్ ట్రెజరర్, సెక్రెటరీ మైలవరం సబ్ బ్రాంచ్ గూడూరు నాగిరెడ్డి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అమెజాన్ నూతన ప్రచారం ప్రారంభం

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** డిజిటల్ మార్కెట్‌ప్లేస్‌లలో అమ్మకాల కోసం చిన్న వ్యాపారాలకు అవగాహన కల్పించేందుకు అమెజాన్ ఒక కొత్త బ్రాండ్ ప్రచారాన్ని ప్రారంభించిందనీ సంస్థ ఇన్చార్జి కె.ఈశ్వర్ తెలిపారు. నగరంలోని అమెజాన్ స్టోర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఈ ప్రచారంలో మూడు సృజనాత్మక, హాస్యభరితమైన వాణిజ్య ప్రకటనలు ఉన్నాయన్నారు. దిఖోగే తొ బికోగే పేరుతో రూపుదిద్దుకున్న ఈ ప్రచార కార్యక్రమం విక్రేతలు తమ ఉత్పత్తులను ప్రోత్సహించడానికి, విక్రయించడానికి అసాధారణ మార్గాలను తీసుకునే విభిన్న దృశ్యాన్ని చూపుతుందని తెలిపారు. వీటిలో విస్తృత కస్టమర్ బేస్, 100 శాతం సర్వీస్ చేయ గల పిన్ కోడ్‌లకు చేరుకోగల అవకాశం, 18కి పైగా గ్లోబల్ మార్కెట్ ప్లేస్‌లకు అవకాశాలు ఉంటాయని అన్నారు. ఆన్‌లైన్ అమ్మ కాలను అందుబాటులోకి తీసుకురావడం, ప్రభావవంతంగా చేయ డం ద్వారా అన్ని పరిమాణాల వ్యాపారాలను శక్తివంతం చేయ డం లో అమెజాన్ నిబద్ధతను ఈ ప్రచారం నొక్కి చెబుతుందని తెలిపారు.

## నిత్యాన్నదానానికి విరాళం

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి జగ్గయ్యపేట పట్టణానికి చెందిన కొలగాని అంజయ్య, అన్నపూర్ణమ్మ, రాము, నర్మదా, నాగరాజు, సత్యవాణి రూ.1,01,116 విరాళంగా అందజేశారు. దాతలకు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి స్వామి ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. ఆలయ అర్చకులు రామకృష్ణమాచార్యులు పూజలు నిర్వహించారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంకెటిఎన్.వరప్రసాద్ తెలిపారు.

## చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం పరిశీలన

**ప్రజాశక్తి - కంచికచర్ల :** పరిటాలలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని (ఎస్‌డబ్ల్యూపీసీ) కలెక్టర్ లక్ష్మీశ శనివారం పరిశీలించారు. ఈ కేంద్రం పూర్తిస్థాయిలో పనిచేసేలా, సామర్థ్యం మేరకు వర్మీ కంపోస్టును తయారుచేసేలా సిబ్బందికి ఆదేశాలిచ్చారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ తీరును, డ్రెయిన్లను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. తడిచెత్త, పొడిచెత్తను విడివిడిగా సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. క్షేత్రస్థాయి పర్యటనలో కలెక్టర్ వెంట డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీనివాసరావు, నందిగామ ఆర్‌డిఒ కె.బాలకృష్ణ, ఎంపిడిఒ బిఎం లక్ష్మి కుమారి, ఇఒ ఆర్‌డి.శ్రీనివాస్, ఇన్చార్జి తహశీల్దార్ వేమూరి మానస, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, గ్రామ పెద్దలు, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

చెత్త సేకరణ పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

## ఉచిత దంత వైద్య శిబిరం

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :** నిమ్రా ఫార్మసీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం మూలపాడు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డిఎవి స్కూల్ కొండపల్లిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిమ్రా దంత వైద్య కళాశాల డాక్టర్ సురేష్ బృందం, ఎన్‌ఎస్‌ఎస్ నిమ్రా కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్స్ కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పలు దంత సమస్యలు, ఇతర సమస్యల గురించి చక్కగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** నియోజకవర్గంలో అక్రమ ఇసుక రవాణాపై ఉక్కు పాదం మోపినట్లు జగ్గయ్యపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని సిఐ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జగ్గయ్యపేట నియోజకవర్గంలో అక్రమ ఇసుక రవాణాపై ఇప్పటికి 55 కేసులు నమోదు చేశామన్నారు. వీటిలో 46 ట్రాక్టర్లు, 23 లారీలు, 2 జెసిబిలను సీజ్ చేసినట్లు తెలిపారు. జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలో 15 చెక్ పోస్టుల ద్వారా అక్రమ ఇసుక రవాణా నివారించేందుకు తమ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జగ్గయ్యపేట సర్కిల్ పరిధిలోని 6 ఇసుక రీచ్‌లు ఉన్నాయని, ఈ రీచ్‌లలో ప్రస్తుతం ఓపెన్‌లో లేవన్నారు. ఆంధ్రాలో గల ఇసుకను తెలంగాణ వెళ్లకుండా ఉండేందుకు 15 చెక్ పోస్ట్‌లలో భారీ భద్రత ఏర్పాటు చేయడంతో పాటు డ్రోన్ సీసీ కెమెరాలతో గట్టిగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిల్లకల్లు, జగ్గయ్యపేట ఎస్ఐలు టి.సూర్య శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట సిఐ వెంకటేశ్వర్లు

## ట్రక్కు ఆటో బోల్తా తృటిలో తప్పిన ప్రమాదం

**ప్రజాశక్తి - జి.కొండూరు :** మండలంలోని కందులపాడు అడ్డా రోడ్డు వద్ద ఉన్న బుడమేరు వంతెనపై ట్రక్కు ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. విజయవాడ వైపు నుండి మైలవరం వైపు వెళుతున్న ఈ ఆటో వంతెనపై రోడ్డు సరిగా లేకపోవడంతో మెరక ఎక్కబోయి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న వ్యక్తికి ఎలాంటి గాయాలవలేదు. ఇదే వంతెన శిథిలావస్థలో ఉండడంతో దీనికి ప్రత్యామ్నాయంగా మరో తాత్కాలిక వంతెనను అధికారులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. జి.కొండూరు నుండి విజయవాడ వైపు ఇది షార్ట్ కట్ రోడ్డు అవడంతో నిత్యం ఈ రోడ్డుపై పదుల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తూ ఉంటాయి. ఇప్పటికైనా మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ అధికారులు మేల్కొని పూర్తిస్థాయిలో వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు వాహనదారులు కోరుతున్నారు.

## చిత్రలేఖనంపై శిక్షణ

**ప్రజాశక్తి - భవానీపురం :** సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యాధరపురంలోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో చిత్రలేఖనం శిక్షణా తరగతులను శనివారం ప్రారంభించారు. ఎంఎల్‌ఎ కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి, సుజనా ఫౌండేషన్ సభ్యులు పాల్గొని చిత్రలేఖనం తరగతులను ప్రారంభించారు. సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ హోమ్‌లోని బాలురకు వాలీబాల్, క్యారమ్స్, చెస్ వంటి ఆటల్లో ప్రోత్సహిస్తున్నామన్నారు. చిత్రలేఖనం శిక్షణ అనంతరం ప్రత్యేక పోటీలను నిర్వహించి వారికి సర్టిఫికెట్స్‌ను అందజేస్తామని తెలిపారు.

మాట్లాడుతున్న సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి

# నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలి : కలెక్టర్

**ప్రజాశక్తి- కలక్టరేట్ (కృష్ణా) :** ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలను నిష్పక్షపాతంగా, స్వేచ్ఛాయుత వాతావం ణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కోరారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. ఈ నెల ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ అవుతుందని, ఫిబ్రవరి 10 వరకు అభ్యర్థులు నామినేషన్లు వేయొచ్చన్నారు. ఫిబ్రవరి 11న నామినేషన్ల పరిశీలన ఉంటుందని, ఫిబ్రవరి 13 నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ అని తెలిపారు. ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని వివరించారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని, మార్చి 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందన్నారు. అప్పటివరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లో ఉంటుందని, ఈ నియమావళిని రాజకీయ పార్టీలు తు.చ. తప్పకుండా పాటించాలన్నారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ భారత ఎన్నికల సంఘం - ఎంసీసీ నియమ నిబంధ నలను క్షుణ్ణంగా చదివి వివరించారు. ఎన్నికల నిర్వహణకు జిల్లాలో ముసా యిదా జాబితా ప్రకారం 76 పోలింగ్ స్టేషన్లు కలిగి ఉండగా, వాటిలో గుడివాడ రెవిన్యూ డివిజన్ పరిధిలో 23 పోలింగ్ కేంద్రాలు, మచిలీపట్నం డివిజన్ పరిధిలో 28, ఉయ్యూరు డివిజన్ పరిధిలో 25 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వివరించారు. వీటికి అదనంగా సహాయ పోలింగ్ కేంద్రం కోసం ఒకటి ప్రతిపాదించినట్లు ఆయన తెలిపారు. ఉన్న పోలింగ్ కేంద్రాలపై తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ సందర్భంగా కలెక్టర్ కు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖర రావు, కె ఆర్ ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, గుడివాడ, మచిలీపట్నం రెవిన్యూ డివిజన్ల అధికారులు జి బాలసుబ్రమణ్యం, కే స్వాతి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పీవీ గజేంద్రరావు (బిజెపి), షేక్ సిలార్ దాదా (వైఎస్ఆర్ సిపి), కొడాలి శర్మ (సిపిఐ(ఎం), అబ్దుల్ మతీన్( ఐ ఎన్ సి), ఎస్. బాలాజీ (బీఎస్పీపి) తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

సమావేశానికి హాజరైన వివిధ పార్టీల నాయకులు

## నేటి నుంచి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

**ప్రజాశక్తి-మోపిదేవి :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సుబ్రమణ్యేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. స్వామివారిని పెళ్లి కుమారుని చేసి భక్తుల దర్శనానికి అనుమతిస్తారు. ఈ బ్రహ్మోత్సవాలు జరిగే అన్ని రోజులు దేవస్థానంలో నిత్యం జరిగే ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్లు చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాలు డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి దాసరి శ్రీరామ వర ప్రసాద రావు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగ్గ అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన చెప్పారు. టిటిడి కళ్యాణ మండపంలో అన్నప్రాసన అక్షరాభ్యాసం చెవి పోగులు కుట్టడం తలనీలాలు సమర్పించడం తదితర సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. దేవస్థానానికి రంగురంగుల విద్యుత్ దీపాలంకరణతో కొత్త శోభను తీసుకొచ్చారు. స్వామి వారి ఊరేగింపు అవసరమైన రథమండపం సిద్ధం చేశారు. మోపిదేవి ఎస్ఐ సత్య నారాయణ పర్యవేక్షణలో బందోబస్తు చేపట్టనున్నారు

## స్వచ్ఛ చల్లపల్లికి విరాళం

**ప్రజాశక్తి-చల్లపల్లి :** స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమం స్ఫూర్తిదాయకం అని ఎన్ఆర్ఐ డాక్టర్ దోనేపూడి శరత్ అన్నారు. శనివారం చల్లపల్లిలో స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం కోసం ఆయన రూ.75 వేలు విరాళాన్ని మన కోసం మనం ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాదు దంపతులకు అందచేశారు. గ్రామ పరిశుభ్రత, సుందరీకరణ కోసం పదేళ్లుగా శ్రమిస్తున్న స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డీఆర్ కే ప్రసాద్ - డాక్టర్ టీ పద్మావతి దంపతులు, కార్యకర్తలు ఆదర్శనీయులు అన్నారు. శనివారం స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డీఆర్ కే ప్రసాద్ - డాక్టర్ టీ పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యకర్తలు స్థానిక పెద్దకళ్లేపల్లి రోడ్డులో స్వచ్ఛ సేవలు అందించారు.



## సూరపనేని మృతి తీరని లోటు : యలవర్తి

**ప్రజాశక్తి - గుడివాడ :** ఎన్‌టిఆర్ స్టేడియం కమిటీ జీవితకాల సభ్యులు సూరపనేని వెంకటరమణమూర్తి మృతి తీరని లోటని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియం ఆవరణలో సూరపనేని సంతాప సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు ళులర్పించారు. అనంతరం సంతాప సభలో ఆయన మాట్లాడుతూ జైభారత్ ఇంజినీరింగ్ ఇండస్ట్రీని స్థాపించి వ్యవసాయ పనిముట్లు తయారీలో రాష్ట్రంలోనే అగ్రగామి సంస్థగా నిలిపారన్నారు. వ్యవసాయ కూలీలకు ఉపయోగపడే విధంగా రైతు పనిముట్లను తయారు చేసి వ్యక్తి అని కొనియాడారు. స్టేడియం అభివృద్ధికి, క్రీడాకారుల అభివృద్ధికి తోడ్పాటును అందించారన్నారు. వికెఆర్ అండ్ విఎన్‌బి కళాశాల, ఆటోనగర్ కమిటీ సభ్యులుగా ఎనలేని సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు పంగప్రసాద్, సభ్యులు గుండిమెడ రాఘ వేంద్రరావు, పర్వతనేని ఆనంద్, బి.తరుపతయ్య, వల్లభ నేని లక్ష్మీప్రసాద్, మున్నలూరి లక్ష్మణరావు, స్టేడియం మేనేజర్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటరమణమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

## 4న కుంభమేళాకు ఆర్‌టిసి బస్సు ఏర్పాటు

**ప్రజాశక్తి - గుడివాడ :** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు గుడివాడ ఆర్‌టిసి డిపో నుండి ఈ నెల 4వ తేదీన నాన్ ఏసీ స్లీపర్ బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో అసిస్టెంట్ మేనేజర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 7 రోజుల పాటు సాగే ఈ యాత్రకు ఆసక్తి కలవారు అసిస్టెంట్ మేనేజర్ లేదా సెల్ నెం : 7382903299కు సంప్రదించాలని తెలిపారు.

# విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ

**ప్రజాశక్తి - గుడివాడ :** స్థానిక ఫాదర్ బియాంకి బాలికల ఉన్నత పాఠశాలలో శ్రీకష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరి కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో లక్ష్మీ కంప్యూటర్స్ వారి సహకారంతో పదవ తరగతి 103 మంది విద్యార్థినులకు పరీక్షల నిమిత్తం ఉపయోగపడే వస్తువులు ప్యాడ్,స్కేల్, పెన్సిల్, పెన్ను, రబ్బరులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ మాజీ ప్రతిపక్ష నాయకులు లింగం ప్రసాద్ విద్యార్థినులకు స్టడీ మెటీరియల్స్ సంబంధించిన వస్తువులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవ సేవా సంఘం ద్వారా అనేక సేవా కార్యక్రమం చేస్తున్న పుట్టి హరి కుమార్ యాదవ్‌ను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని మంచి కార్యక్రమాలు చేయాలని, టెన్త్ క్లాసులో 90 శాతం మార్కులు పైన తెచ్చుకున్న విద్యార్థినీలకు జూన్ నెలలో ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేశంశెట్టి అజయ్ కుమార్, మాకుల సత్యం, కంతేటి హరిబాబు, జాజుల తాతారావు, స్కూల్ హెచ్‌ఎం జి.జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 'మీకోసం'కు తాత్కాలిక విరామం : కలెక్టర్

**ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :** శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గానికి ద్వైవార్షిక ఎన్నికల షెడ్యూల్ విడుదలతో కష్ణా జిల్లాలో కోడ్ అమలులో ఉన్నందున సోమవారం నిర్వహించే "మీకోసం" (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి తాత్కాలిక విరామం ప్రకటించినట్లుకలెక్టర్ డీకే బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం శాసనమండలి పట్టబద్రుల నియోజకవర్గానికి ఎన్నికకు జనవరి 29వ తేదీన షెడ్యూల్ విడుదల చేసి తక్షణమే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ( ఎంసిసి) అమలులో ఉంటుందని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈనెల మూడవ తేదీ సోమవారం కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్లు, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయా లలో నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సెల్ సిస్టం (పిజిఆర్ఎస్) తాత్కాలిక విరామం ప్రకటించాలనమ,ఇ అయితే పిజిఆర్ఎస్ ఆన్‌లైన్ పోర్టల్ లోను తమ సమస్యలను నమోదు చేసుకోవచ్చునని కలెక్టర్ తెలిపారు.

## మధ్యాహ్న భోజనం పరిశీలన

**ప్రజాశక్తి-పమిడిముక్కల :** విద్యార్థులు బాగా చదువుకొని ఆటల్లోనూ చదువుల్లోనూ ఉత్తమ ఫలితాలు సాధించాలని పమిడిముక్కల జెడ్పిటిసి సభ్యురాలు ఏనుగు వెంకట రమణ కుమారి అన్నారు. శనివారం పమిడిముక్కల మండలంలోని హనుమంతపురం ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించి మధ్యాహ్నం భోజనం పరిశీలించారు. ఉపాధ్యాయులు క్రమశిక్షణతో విద్యను బోధించాలని, విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా బోధన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పమిడిముక్కల వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, ఏనుగ మస్తాన్రావు, ప్రధానోపాధ్యా యులు కొండలరావు తదితరుల పాల్గొన్నారు.

## ప్రాంగణ ఎంపికల్లో గుడ్లవల్లేరు విద్యార్థి ప్రతిభ

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** టెక్సాస్ ఇంస్ట్రుమెంట్స్ వారు ఆన్లైన్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించగా రాష్ట్ర వ్యాప్తంగా 25 ప్రభుత్వ, ప్రయివేట్ పాలిటెక్నిక్‌ల ద్వారా ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ విభాగాల నుండి మొత్తంగా 1,119 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల వయస్సును బట్టి వారికి రాత పరీక్ష నిర్వహించగా వారిలో రాష్ట్ర వ్యాప్తంగా 92 మంది విద్యార్థులకు రాత పరీక్ష లో ఉత్తీర్ణులయ్యారు. వీరికి ఇంటర్వ్యూ నిర్వహించగా రాష్ట్ర వ్యాప్తంగా 15 మంది విద్యార్థులు ఈ డ్రైవ్ లో వార్షిక ఆదాయం రూ.9.02 లక్షల వేతనంతో ఎంపిక అయ్యారని, వారిలో గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ నుండి ఇ.సి.ఇ విభాగానికి చెందిన జె.కష్ణ నిఖిల్ ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్ ఆనందాన్ని వ్యక్తం చేసారు. విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణ తో కష్టపడితే సాదించలేదిదంటూ ఏది ఉండదని అన్నారు. కళాశాల చైర్మన్ డా.వల్లూరుపల్లి నాగేశ్వర రావు, సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ వల్లూరుపల్లి సత్య నారాయణరావు, ఇ.సి.ఇ బ్రాంచ్ సీనియర్ లెక్చరర్ ఏవిఎన్ఎల్ రోజినీ, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎం.నారాయణరాజు

## ఆటో డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలి

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ ఎం.నారాయణరాజు అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆటో డ్రైవర్లతో రోడ్డు భద్రతపై శనివారం పట్టణంలోని ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో ఆటో డ్రైవర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎంవిఐ నారాయణరాజు మాట్లాడుతూ ఆటో వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. రోడ్డు భద్రతకు ఆటో వాహనదారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు మద్యం తాగి ఆటోలను నడపకూడదని, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని అన్నారు. డ్రైవర్ పక్కన ప్రయాణికులను ఎక్కించుకోకూడదని, ఆటోల్లో టేప్ రికార్డర్లు ఉపయోగించకూడదని సరైన పత్రాలు వాహనంలో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ ఆర్.శ్రీనివాస్, ఎక్సైజ్ సిఐ గురవయ్య, ఆటో యూనియన్ అధ్యక్షులు ప్రభు, యూనియన్ నేతలు సాంబయ్య, సైదులు, రాజు పాల్గొన్నారు.

## ఆనం కోటేశ్వరరావుకు డాక్టరేట్

**ప్రజాశక్తి - తిరువూరు :** తిరువూరు శ్రీవాహిణి ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆనం కోటేశ్వర రావుకు గౌరవ డాక్టరేట్ లభించింది. కళాశాలలో సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలో సహాయ ఆచార్యుడిగా పనిచేస్తున్న కోటేశ్వరరావు తమిళనాడులోని అన్నమలై యూనివర్సిటీ నుంచి కెమిస్ట్రీ విభాగంలో డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం శనివారం కోటేశ్వరరావును శాలువాతో సత్కరించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న అభివృద్ధికి అనుగుణంగా అధ్యాపకులు బోధన సామర్థ్యాన్ని పెంచుకోవాలని కళాశాల చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పోట్రు నాగేశ్వరరావు, సెక్రటరీ ఊటుకూరు సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ ముత్యాల కిషోర్ బాబు, వట్టూరి మోజెస్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

## ఉత్తమ పనితీరుతో సామ్‌సంగ్ గెలాక్సీ ఎస్25

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :**

సామ్‌సంగ్ అత్యుత్తమంగా తయారు చేసిన ఉత్పత్తి గెలాక్సీ ఎస్25 అని కంపెనీ ప్రెసిడెంట్, మొబైల్ ఎక్స్‌పీరియన్స్ డివిజన్ హెడ్ టిఎం రోహన్ తెలిపారు. నగరంలోని శామ్సంగ్ షోరూంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. గెలాక్సీ ఎస్25 అనేది కెమెరా, బ్యాటరీ కోసం హార్డ్‌వేర్‌లో సాటిలేని నాయకత్వంతో వస్తున్న అతి సన్నటి, అత్యంత మన్నికైన స్మార్ట్‌ఫోన్ అని తెలిపారు. ఇది గెలాక్సీలో అత్యుత్తమ పనితీరు కలిగిన కస్టమైజ్డ్ ప్రాసెసర్‌ని కలిగి ఉందన్నారు. ఎస్ సిరీస్ అత్యుత్తమ కెమెరా అనుభవానికి మరింత కలిపి సుసంపన్నం చేయబడిందని తెలిపారు. గెలాక్సీ ఏఐతో, ఏఐ ఆధారిత చిత్ర నాణ్యత, ఇమేజ్ ఎడిటింగ్ సామర్థ్యాలు ఏర్పడతాయని' ఆయన తెలిపారు. గెలాక్సీ ఎస్25 అల్ట్రా, గెలాక్సీ ఎస్ 25 ప్లస్, గెలాక్సీ ఎస్25ని ప్రీ-ఆర్డర్ చేయవచ్చని తెలిపారు.

# సాగర్ నుంచి కెనాల్‌కు నీటి విడుదల పరిశీలన

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెరువు మాదారం వద్ద నాగార్జునసాగర్ ఎడమ కాలువ జోన్ 2 పరిధిలోని 16, 17 డివిఆర్ బ్రాంచ్ కెనాల్‌కు నీటి విడుదలను అధికారులు పరిశీలించారు. నాగార్జునసాగర్ లాల్ బహదూర్ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, నందిగామ, జగ్గయ్యపేట డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌లు రాటకొండ చంద్రశేఖరరావు, ఏలూరు గోపాలరావు, వైస్ చైర్మన్ మన్నే నారాయణరావు, నీటి సంఘం అధ్యక్షులు కర్ల నాగేశ్వరరావు, జగ్గయ్యపేట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంతోష్ రాథోడ్, జగ్గయ్యపేట సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాంబాబు, జగ్గయ్యపేట అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపాల్ నాయక్, తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరేష్ వీరిలో ఉన్నారు. ఈ సందర్భంగా కోట వీరబాబు మాట్లాడుతూ ఆంధ్ర ప్రాంతానికి రావలసిన సాగర్ జలాలను సకాలంలో విడుదల చేసి రైతులను ఆదుకోవాలని తెలంగాణ ప్రాంత ఎన్ఎస్పి అధికారులను కోరారని, దీనిపై తెలంగాణ ప్రాంతానికి చెందిన చెర్వుమాధారం ట్యాంక్ పర్యవేక్షణ

అధికారి నరేష్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. రాబోయే వారం రోజులు పాటు నిరంతరాయంగా సిఎం ట్యాంక్ నుండి నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్ర ప్రాంతంలోని రైతులు కూడా వారబంధి పద్ధతిలో దిగవ రైతులకు సాగు నీరందించడానికి సహకరించాలని కోరారు వారబంది పద్దతిని సక్రమంగా అమలు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నీటి సంఘాల ప్రతినిధులతో కలిసి జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య)ని కలిసి నీటి విడుదలపై సమగ్ర సమాచారాన్ని అందించారు.

## ఆరోగ్యంతోనే విద్య

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్య మీద మనసు లగ్నం చేయగలుగుతారని కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు అన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. గత నాలుగు సంవత్సరాలుగా తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాల ప్రాజెక్ట్ సహకారంతో జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న బాలికలకు రీ యూజబుల్ (పునర్ వినియోగించే) శానిటరీ ప్యాడ్స్‌ను అందజేస్తున్నామని తెలిపారు. అనంతరం 200 మంది బాలికలకు సుమారు రూ.70 వేల విలువైన ప్యాడ్స్‌ని అందజేశారు. కార్యక్రమానికి హాజరైన పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు షేక్ నజీమూన్ మాట్లాడుతూ స్త్రీ జీవితంలో రుతుక్రమం సాధారణమైన

ప్రక్రియ అని, ఆ సమయంలో తీసుకోవలసిన పలు జాగ్రత్తలు విశదీకరించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ శారద కిషోర దశలో బాలికలు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలు తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు మాధవి లత సభకు అధ్యక్షత వహించగా, పాఠశాల మహిళా సిబ్బంది, ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

# నగర మహాసభలను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :** భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (యం సిపిఐ)ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కమిటీ సమావేశం కలకోటి బసవయ్య అధ్యక్షతన ఇబ్రహీంపట్నం జిల్లా కమిటీ కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మర్రెడ్డి.వెంకటరెడ్డితో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు గొల్లపూడి ప్రసాద్, కాసాని గణేష్ బాబు,బండారు శ్రీనివాసరావు, వల్లెపు లక్ష్మీనారాయణ, కూర జాన్ బాబులతో పాటు ప్రత్యేక ఆహ్వానితులుగా తులసిప్రసాద్ పట్నాయక్ మాట్లాడారు. ఫిబ్రవరి 26న పార్టీ విజయవాడ నగర కమిటీ నిర్వహించ తలపెట్టిన పార్టీ రెండో నగర మహాసభలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో భారత ఐక్య యువజన సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రత్యేక ఆహ్వానితులు

## తిరువూరు ఎస్ఐకు సత్కారం

**ప్రజాశక్తి - తిరువూరు :**

తిరువూరు సెక్టార్ ఎస్ఐ సత్యనారాయణకు పోలీస్ స్టేషన్లో శనివారం పౌర సన్మానం చేశారు. ఇటీవల విజయవాడలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నందుకు గానూ సత్కరించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఎస్ఐ చేసిన కృషిని వార్డు కౌన్సిలర్ మోదుగు ప్రసాద్, మూడు దుర్గారావు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గుమ్మ పాపారావు, ఇనుపనూరి చిన్నారి రవి, యరదేశి రామారావు, కంచిపోకు కృష్ణ, చందు, గోపి తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తున్న ప్రాంతంలో పోలీసులు

## కోడిపందేల నిర్వాహకులపై కేసు

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :**

చిల్లకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని తిరుమలగిరి రెవెన్యూ ప్రాంతంలో కొంతమంది తెలంగాణ, ఆంధ్రప్రాంతాలకు చెందిన కొంతమంది కోడిపందేలు వేస్తున్నారని సమాచారంతో చిల్లకల్లు ఎస్ఐ టి.సూర్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది మెరుపు దాడి చేశారు. ఈ దాడుల్లో 13 బైకులు, ఐదుగురు వ్యక్తులు, రూ.6,500 లు లభ్యమైనట్లు, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## వార్డులో ఎంఎల్ఎ పర్యటన

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** పట్టణంలోని 31 వ వార్డు శాంతినగర్, విష్ణుప్రియ నగర్‌లో స్థానిక టిడిపి నేతలతో కలిసి శనివారం శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలు సిసి రోడ్డు, డ్రైన్లు, కరెంటు లోవోల్టేజ్ సమస్య, పెన్షన్లు రాలేదని ఎమ్మెల్యే రాజగోపాల్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ స్థానిక సమస్యలు తెలుసుకుని వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మైనేని రాధాకృష్ణ, గింజుపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :** వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్ట్ గొల్లపూడి ఆధ్వర్యంలో గొల్లపూడి లోని ఎస్‌పిఎస్ఆర్‌సి ప్రభుత్వ హైస్కూల్లో మేధా-2025 పేరుతో రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గుంటుపల్లి సెయింట్ ఆన్స్ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థిని మోగులూరి శ్రేష్ఠ, రాష్ట్రస్థాయి తృతీయ బహుమతిని పొందారు. ఈ కార్యక్రమం వడ్లమూడి రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి విద్యావంతులు అవ్వాలన్నారు. క్విజ్, వ్యాసరచన, కథల పోటీలలో పాల్గొనాలని సూచించారు. గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్, మెమెంటో, నగదు బహుమతి అందజేశారు. ఈ పోటీలకు ఆల్ ఇండియా రేడియో విశ్రాంత డైరెక్టర్ ముంజులూరి కృష్ణకుమారి, సాహితీ విమర్శకులు బాలాంతరపు ప్రసూన, న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. బహుమతి పొందిన శ్రేష్ఠను సెయింట్ ఆన్స్ స్కూల్ యాజమాన్యం అభినందించారు.

## దేవాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** నియోజకవర్గంలోని వివిధ దేవాలయాల అభివృద్ధికి సిజిఎఫ్ నిధులనుండి రూ.4.90 కోట్లు నిధులు మంజూరయినట్లు ఎంఎల్ఏ శ్రీరామ రాజగోపాల్ తాతయ్య తెలిపారు. నిధులు మంజూరైన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి శనివారం జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ధన్యవాదాలు తెలిపారు.

## ఎన్నికల కోడ్ మరిచారు

**ప్రజాశక్తి - నందిగామ :** నందిగామ ఎంఎల్ఏ తంగిరాల సౌమ్య, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కటౌట్ నందిగామ గాంధీ సెంటర్లో రోజు వేలాదిమంది సంచరించే ప్రాంతంలో నిట్టనిలువుగా 50 అడుగుల ఎత్తున దర్శనమిస్తున్నా ఎన్నికల అధికారులకు కనపడక పోవటం విచిత్రంగా ఉంది. ఒకపక్క మున్సిపల్ చైర్మన్ ఎన్నిక మరోపక్క ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నా చలనం లేదు. నందిగామలో పలు చోట్ల రాజకీయ నాయకులు ఫ్లెక్సీలు, కటౌట్స్ తొలగించని నిర్లక్ష్యం వుంది. దీనిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## డిజిపిని కలిసిన ఎస్‌పి

**ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) గా బాధ్యతలు స్వీకరించిన హరీష్‌కుమార్ గుప్తాని మంగళగిరి రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో కష్ణా జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిజిపికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## కోర్టులు ఉత్తర్వులిచ్చినా పట్టించుకోని కూటమి ప్రభుత్వం

**ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్ :** చట్ట ప్రకారం ఏసీసీ కార్మికులకు నష్టపరిహారం చెల్లిం చాలని, లేబర్ కోర్టు, హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఎసిసి కార్మికుల రిలే నిరాహార దీక్షలు 60వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను కార్మిక నాయకురాలు టి. దుర్గాభవాని ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గా రావు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని మారినా ఏసీసీ కార్మి కుల సమస్యను పట్టించుకునే నాధుడే కరువయ్యాడని ఆయన అన్నారు. నారా లోకేష్ ఎన్నికల సమయంలో సమస్య పరిష్కరిస్తామని కార్మికులకు హామీ మంత్రి అయ్యాక ఆ మాటే మరిచారని విమర్శించారు. ఎసిసి కార్మికులకు యాజమాన్యంరూ.43 కోట్ల నష్టపరిహారం ఇచ్చేందుకు లోకేష్ కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం దీక్షలలో అల్లం విజయశ్రీ, టి.శారద, వై.రమాదేవి, దర్శి మల్లేశ్వరి, నారమ్మ కూర్చున్నారు. దీక్షలకు కూరపాటి స్టీవెన్, బి.అంకయ్య, ఎస్.కే.భాష, ఇస్మాయిల్, సుబ్బారావు, యెహోషువ, కృష్ణ, లాజరు, రామాంజియా, నాగేశ్వరరావు సంఘీభావం తెలిపారు.

# కూచిపూడి-మొవ్వ రోడ్డును పూర్తి చేయాలని వినతి

**ప్రజాశక్తి చల్లపల్లి (మొవ్వ) :** కూచిపూడి టూ మొవ్వ ఆర్ అండ్ బి రోడ్డు నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని సిపిఎం మండల కార్యదర్శి శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిని మరమ్మతు చేసే నేపథ్యంలో కూచిపూడి నుంచి మొవ్వ వెళ్లడానికి ప్రయాణికులకు చాలా ఇబ్బందిగా ఉందని ఆరోపించారు. సిమెంట్ ధూళితో కాలుష్యం వల్ల ప్రయాణి కులకు అనారోగ్యం పొంచి ఉంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు పక్కన ఉన్న వరి పొలాల్లో ఉన్న మినుము పంట సిమెంట్ ధూళితో కప్పబడి లేత మొక్కలు పాడైపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఈ కారణంగా పంట దిగుబడి తగ్గిపోతుందని, ఆర్థికంగా రైతులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని విచారణ వ్యక్తం చేశారు. అందరికీ ఇబ్బందిగా ఉన్న ఈ రోడ్డు యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని ప్రజాప్రతినిధులకు, సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లకు విజ్ఞప్తి చేశారు.

వాహనాలు వెళ్లేటప్పుడు రేగుతున్న దుమ్ము

విజయం సాధించిన విద్యార్థినీలు

# ఆటల పోటీల్లో కంకిపాడు విద్యార్థునుల ప్రతిభ

**ప్రజాశక్తి-కంకిపాడు :** పెనమలూరు నియోజకవర్గం స్థాయిలో జరిగిన 84వ బాలికల గ్రిగ్ మెమోరి యల్ ఆటల పోటీలలో కంకిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారాని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుధా రాణి తెలిపారు. ఆకునూరు పాఠశాలలో జరిగిన ఈ పోటీల్లో సీనియర్ కబడ్డీలో ప్రథమ స్థానం, సాఫ్ట్ బాల్‌లో ప్రథమ స్థానం, జూవియల్ విభాగం సాఫ్ట్ బాల్‌లో ప్రథమ స్థానం సాధించార న్నారు. గెలుపొందిన వారు జిల్లాస్థాయి గ్రిగ్ మెమోరియల్ పోటీలకు వెళ్ళి ఆడతారని అన్నారు. గెలుపొందిన బాలికలను, శిక్షణ నిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు లకనం దుర్గాప్రసాద్‌ను ప్రధానోపాధ్యాయులతో పాటు విద్యా కమిటీ చైర్మన్ షేక్ అగ్ర్ షరీఫ్, ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## మెడికల్ కౌన్సిల్‌కు చైర్మన్‌ను నియమించాలని ఆందోళన

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** ఎ న్టీ ఆ ర్ హెల్త్ యూనివర్సిటీ ముందు అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ కౌన్సిల్కి చైర్మన్ని ,బోర్డ్ను వెంటనే నియమించాలనీ ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి వలరాజు ,ఉపాధ్యక్షులు ఏం సాయికుమార్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఏడు మాసాలు గడుస్తున్నా ఇంకా ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ కి చైర్మన్ నియమించలేకపోవడం దారుణమని వెంటనే ప్రభుత్వం చైర్మన్ నియమించాలని డిమాండ్ చేశారు. చైర్మన్ ని నియమించకపోవడం వల్ల రాష్ట్రంలో మరియు విదేశాల్లో వైద్య విద్యను పూర్తి చేసుకుని పర్మినెంట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కోసం నెలలు తరబడి వేచి చూస్తున్నా అన్నారు, రాష్ట్రంలో విద్య వైద్య శాఖల సుభిక్షంగా నడుస్తున్నాయని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వైద్యశాఖ మంత్రి సత్య కుమార్ ప్రకటిస్తున్నారు కానీ రాష్ట్రంలో వైద్యరంగం కుదేలవుతున్నదని కోట్ల రూపాయలు పోగేసుకుని చదవవలసిన పరిస్థితి పాలక ప్రభుత్వాలు తీసుకొని వచ్చాయని, 107 108 జివో రద్దు చేస్తామని ప్రకటించిన నారా లోకేష్ తమ హామీలను ఇప్పుడు పట్టించుకోవడంలేదని అన్నారు. పైగా రాష్ట్రంలో మెడికల్ కళాశాలను అభివద్ధి పథంలో నడిపించాల్సింది పోయి, కేవలం రాజకీయ స్వప్రయోజనాల కోసం విద్యార్థుల జీవితాలు తాకట్టు పెట్టే విధంగా తిరిగి సీట్లు వద్దు అని లెటర్ రాసి పంపిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వాన్ని అన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ కి చైర్మన్ నియమించాలి బోర్డు మెంబర్ల నియమించాలని, పారా మెడికల్ కౌన్సిల్ కు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కార్తీక్, విజయవాడ నగర అధ్యక్ష కార్యదర్శులు రంజిత్ , జగదీష్ , కోశాధికారి సురేష్ , నాయకులు అభి , మధు , గోపి, గోపి చంద్ , కక్షాయని తదితర్లు పాల్గొన్నారు.

## హామీల అమలులో ప్రభుత్వం విఫలం

**ప్రజాశక్తి- ఘంటసాల :** కూటమి ప్రభుత్వ వాగ్దానాలు నమ్మి ప్రజలు తీవ్రంగా మోసపోయారని బీఎస్పీ కష్ణాజిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు నాగేశ్వరరావు అన్నారు. ఘంటసాల మండలం కొడాలి గ్రామంలో బీఎస్పీ నేతల సమావేశం శనివారం సాయంత్రం జిల్లా ఉపాధ్యక్షులు, నియోజకవర్గ ఇన్చార్జి నాగేశ్వరరావు ఆధ్వ ర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్టులో ఏపీకి మొక్కుబడి నిధులు విడుదల చేశారే కాని, నిత్యావసర ధరల పై స్పష్టమైన హామీ ఇవ్వలేదన్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో అమ్మఒడి, రైతు భరోసా, కార్మికులకు, చేతి వృత్తుల వారికి వివిధ పథకాలను బటన్ నొక్కుతుండే వారని వారికంటే మెరుగ్గా ఇస్తామని, ఇంటిలో ఎంతమంది విద్యార్థులు ఉంటే అందరికి అమ్మ ఒడి ఇస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలకు ప్రజలు మోసపోయారని, నేటి ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యలో పడినట్లుందన్నారు. ఈ సమావేశంలో బీఎస్పీ ఘంటసాల, చల్లపల్లి మండల అధ్యక్షులు గరికముక్కు నాగేశ్వరరావు, కొడాలి దేవా, ఇతర నేతలు పాల్గొన్నారు.

# బడ్జెట్లో తీవ్ర అన్యాయం : విపక్షాలు

**ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి, విజయవాడ**

**కేంద్ర బడ్జెట్లో రాష్టానికి మరోసారి మొండిచేయి చూపారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని ఎన్‌డిఎకు రాష్టంలోని కూటమి ప్రభుత్వం మద్దతు ఇస్తున్నప్పటికీ... బడ్జెట్‌లో మరో సారి రాష్టానికి మొండి చెయ్యి చూపిందని పలువురు విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌పై రాజకీయ పక్షాలు, ఉద్యోగ, కార్మిక సంఘాలు మండిపడు తున్నాయి. నిధులు సాధించడంలో కూటమి ప్రభుత్వం విఫలమయిందని దుయ్యబట్టారు. అధికార పక్ష కూటమి నేతలు బడ్జెట్ పట్ల హర్షం వ్యక్తం చేశారు.**

**న్యాయశాఖకు అదనపు నిధులు అవసరం**

**లంకిశెట్టి బాలాజీ, మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు**

న్యాయశాఖకు అదనపు నిధులు కేటాయించి ఉండాల్సింది. అప్పుడు న్యాయస్థానాలను నిర్మించుకుని నూతన న్యాయమూర్తులను నియమించుకునే అవకాశం ఉండేది. కేసుల పరిష్కారానికి దోహదపడేది. దేశంలో కొత్తగా 75 వేల ఎంబిబిఎస్ సీట్లు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నాం.

**నేతన్నలను పట్టించుకోలేదు, సజ్జా నాగేశ్వరరావు, ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర పూర్వ ఉపాధ్యక్షులు**

చేనేతలకు రూ.10 వేల కోట్లు కేటాయించాలి. చేనేత సంఘాల రుణాలు మాఫీకి, నూలు దారం, ముడి సరుకులపై సబ్సిడీకి నిధులు కేటాయించలేదు. చేనేత వస్త్ర పరిశ్రమలో వాడే రంగులు, రసాయాలు, చేనేత వస్త్రాలు, చేనేత కార్మికుల వేతనాలపై వేసిన జిఎస్‌టి తొలగించాలి. చేనేతల సమస్యలను కేంద్రం పట్టించుకోలేదు.

### మేలు చేస్తుందన్న కూటమి నేతలు

**వ్యవసాయానికి కేటాయింపులు పెంచలేదు**

**ఎపి రైతు, కౌలు రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు నాగేశ్వరరావు, రంగారావు**

సంక్షోభంలో ఉన్న వ్యవసాయరంగానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. ఇది జిల్లాలోని లక్షలాది రైతు, కౌలు రైతు కుటుంబాలపై ప్రభావం చూపుతుంది. రైతు, కౌలు రైతులను రుణ విముక్తికి, పంటలకు కనీస మద్దతు ధర గురించి కనీస ప్రస్తావన చేయలేదు. ఎరువులు, పురుగుమందులు, ఇతర సాగు ఖర్చులు పెరగడంతో రైతుల ఆదాయాలు పడిపోతాయి. పిఎం కిసాన్ యోజన ద్వారా ప్రతి రైతుకు రూ.10 వేలు ఇస్తామని ప్రకటించినా నిధులు పెంచలేదు.

**వ్యవసాయానికి ఊతం**

**బూరగడ్డ వేదవ్యాస్, మాజీ డిప్యూటీ స్పీకర్, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు**

రాష్ట్రానికి పెద్ద పీట వేశారు. మధ్యతరగతి కుటుంబాలకు అనుకూలంగా ఉంది. పోలవరం నిర్మాణానికి రూ.3 వేల కోట్లు కేటాయించారు. కిసాన్ క్రెడిట్‌కార్డుల పరిమితిని రూ.5 లక్షలకు పెంచడం వ్యవసాయ రంగానికి ఊతం ఇస్తుంది.

**దేశీయ బీమా రంగానికి ప్రమాదం**

**చిలకలపూడి కళాధర్, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్, మచిలీపట్నం డివిజన్**

బీమారంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) 100 శాతానికి పెంపు ప్రతిపాదన స్వదేశీ పొదుపు మొత్తాలపై అధిక నియంత్రణకు దారితీస్తుంది. దీని ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం చేకూరదు. బీమా పొందుతున్న ప్రజలకు కూడా ఎలాంటి మేలు జర గదు. విదేశీ మూలధనం స్వదేశీ పొదుపు మొత్తాలపై ఎక్కువ నియంత్రణ కలిగి ఉండే అవకాశం ఉంటుంది. ఆర్థికాభివద్ధిలో దేశీయ పొదుపు ముఖ్యపాత్ర పోషిస్తుంది.

**ఒక్క ప్రాజెక్టుకూ నిధుల కేటాయింపు లేదు**

**ఎంవి.ఆంజనేయులు, టాక్స్‌పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి**

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికే గతి లేదు. ఒక్క ప్రాజెక్టుకు కూడా నిధులు పూర్తి స్థాయిలో కేటాయింపు లేదు. విజయవాడ మెట్రో ఊసే లేదు. ఇంకా అనేక రైల్వే ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి. జాతీయ రహదారుల నిర్మాణం జరగాలి.

**నిరాశపరిచింది**

**మల్లాది విష్ణు, వైసిపి మాజీ ఎంఎల్‌ఎ**

పూర్తిగా నిరాశను మిగిల్చింది. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ లేదు. ఎపికి మరోసారి మొండిచేయే మిగిలింది. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న రాష్ట్రానికి ప్రత్యేక కేటాయింపులు చేయకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఎన్నికలు ఉన్న బీహార్ లాంటి రాష్ట్రాలకు పెద్ద మొత్తంలో వరాలు ప్రకటించి, మిగతా రాష్ట్రాల పట్ల వివక్ష చూపడం సరికాదు. ఎన్‌డిఎలో టిడిపి, జనతాదళ్ (యునైటెడ్) కీలకంగా వ్యవహరిస్తుండగా.. ప్రాజెక్టులు, బడ్జెట్ కేటాయింపులను రాబట్టుకోవడంలో బీహార్ సీఎం నితీష్ కుమార్ సఫలమయ్యారు. కానీ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారు. ఎన్‌డిఎలో భాగస్వామ్యులై ఉంటూ రాష్ట్రానికి నిధులు రప్పించడంలో ఇటు చంద్రబాబు, ఇటు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ విఫలమయ్యారు. ముఖ్యంగా ప్రత్యేక హోదా ఊసే లేదు. విభజన హామీల ప్రస్తావన లేకపోవడం రాష్ట్ర ప్రజలకు తీవ్ర నిరాశను మిగిల్చింది. ఈ అంశాల్లో కేంద్రంపై ఒత్తిడి తేవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

# రాజ్యమేలుతున్న అవినీతి దందా

విజయవాడ నగరపాలక సంస్థలో అవినీతి రాజ్యమేలుతుంది. అడుగడుగునా అవినీతి అక్రమాలే. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా అన్నట్లుగా నగరాన్ని ఏరియాల వారీగా విభజించుకొని ప్రజాప్రతినిధులు, విఎంసిలో ఉన్నత స్థాయిలో ఉన్న వారు అడ్డూ అదుపు లేకుండా దోచుకుంటుంటే తామేమి తక్కువ తినలేదన్నట్లుగా పలువురు అధికారులు తమ విధులను సైతం పక్కన పెట్టి, అక్రమ సంపాదనపై అధిక శ్రద్ధ కనపరుస్తున్నట్లు జోరుగా కథనాలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో అధికార, ప్రతిపక్షం అనే తేడా లేకుండా పోయింది. పలువురు ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు దొరికినకాడ దొరికినట్లు భారీ మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు. ఇదే సమయంలో ఆయాశాఖలకు చెందిన పలువురు అధికారులు అందిన కాడికి కాజేయడమే పనిగా పెట్టుకున్నారు. విఎంసికి వివిధ రూపాల్లో రావాల్సిన కోట్లాది రూపాయల రాబడికి సైతం గండికొడుతున్నారు. న్యాయబద్ధంగా విఎంసికి రావాల్సిన నిధులను రాబట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోట్లాడి సాధించడంలో నగరానికి చెందిన ప్రజాప్రతినిధులు, విఎంసిలోని అధికార, ప్రధాన ప్రతిపక్షం కార్పొరేటర్లు చేష్టలుడికి చూస్తున్నారు. ప్రతి పనికి వెల కట్టి బహిరంగంగా వసూలు చేస్తున్నారనే చర్చ నగరంలో లేకపోలేదు. ఇంటి పన్నులు వసూలు దగ్గర నుంచి ఇళ్ల ప్లాన్ల మంజూరు వరకు, వివిధ రకాల అభివృద్ధి పనులు చేయించే దగ్గర నుంచి వాటికి బిల్లులు మంజూరు చేసే వరకు ముడుపులు ముట్ట చెప్పందే పనులు కావన్నట్లుగా తయారయింది. ప్రధానంగా స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో తీసుకుంటున్న నిర్ణయాలు, కౌన్సిల్ అజెండాలోకి తీసుకొస్తున్న అంశాలు, వాటి ఆమోదం, భారీగా ముడుపులు చేతులు మారుతున్న వైనంపై కూడా జోరుగా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. 2020 నాటి స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సంబంధించి పక్కన పడేసిన లక్షలాది

7 వీక్షణం

రూపాయల బిల్లులను ఇప్పుడు స్టాండింగ్ కమిటీలోకి తీసుకొచ్చి ఆమోదించేసి, సొమ్ము చేసుకోవాలనే దాని వెనుకాల అధికార, ప్రధాన ప్రతిపక్షం కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధుల హస్తం ఉందనే చర్చ జరుగుతోంది. మరోవైపు గత సెప్టెంబర్ మాసంలో వరదల సమయంలో రోజువారీ కార్మికులతో చేయించిన శానిటేషన్ బిల్లుల అంశంలో కూడా తక్కువ మంది కార్మికులను పనిలో పెట్టి, ఎక్కువ మంది పెట్టినట్లు మస్టర్‌లో చూపించి, భారీ మొత్తంలో సొమ్ము చేసుకోవాలని గతంలో ప్రజారోగ్య విభాగంలో పని చేసిన ఒక ముఖ్యఅధికారి, ప్రజారోగ్య విభాగం సెక్షన్‌లోని ముఖ్య ఉద్యోగి చేస్తున్న హడావుడి పట్ల నగర కమిషనర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి సంబంధిత బిల్లుకు సంబంధించిన ఫైల్‌ను పక్కన పడేసినట్లు తెలిసింది. గత సాధారణ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర వ్యాప్తంతో పాటు విజయవాడ నగరపాలక సంస్థ పాలనపై కూడా తీవ్రమైన ప్రభావం చూపింది. గడిచిన ఏడు మాసాల నుంచి ఆ మాటకొస్తే గడిచి సాధారణ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు నుంచే విఎంసిలో పాలన స్తంభించింది. ఈ సుధీర్ఘకాలంలో విఎంసిలో అసలు పాలన ఉందా లేదా అన్నట్లుగా తయారయింది. దీంతో ప్రజాసమస్యల పరిష్కారం కావడం లేదు. ప్రతి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరిస్తున్న అర్జీల పరిష్కారానికి అతీగతీ లేకుండా పోయింది. ఆర్థిక పరమైన అర్జీలను పక్కన పడేస్తున్నారు. పైసా ఖర్చు లేని అంశాలకు సంబంధించిన అర్జీలు సైతం పరిష్కారం కావడం లేదనే చర్చ అర్జీదారుల్లో లేకపోలేదు. కౌన్సిల్‌లో వైసిపి అధికారపక్షం. కానీ కౌన్సిల్‌లో కీలక స్థానంలో ఉన్న వారి దగ్గర నుంచి ఆపార్టీ కార్పొరేటర్లలో కనీసమైన స్పృహ కూడా లేకుండా, ఎవరి దారి వారిదే అన్నట్లుగా తయారయింది. మేయర్ పదవి వచ్చే మార్చి నాటికి ఉంటుందా ఊడుతుందా, తాము వైసిపిలో ఉంటే బౌష్యత్ ఉంటుందా ఉండదా టిడిపి జనసేనలోకి జంప్ అయితే ఎలా ఉంటుందనే ధ్యాస తప్పా నగరాభివృద్ధిపై కనీస ఆలోచన లేకుండా పోయిందనే చర్చ జరుగుతోంది. మరోవైపు రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ స్థానికంగా టిడిపి కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు వారి వారి సొంత వ్యవహారాలపై ఉన్న శ్రద్ధ నగరాభివృద్ధి, విఎంసి ఖజానాను భర్తీ చేద్దామనే ధ్యాస ఏ కోశానా లేదనే చర్చ నడుస్తోంది.

**- విహెచ్‌ఆర్**

## పిబి సిద్ధార్థ ఎన్‌సిసి బాలికల గిన్నీస్ రికార్డు

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :** విజయవాడ పి.బి. సిద్ధార్థ కళాశాలకు చెందిన ఎన్‌సిసి 4వ ఆంధ్రా బాలికల బెటాలియన్ విద్యార్థినులు బి.గ్రీష్మ, కె.గాయత్రి ఇతర రాష్ట్రాల బాలికల 8 క్యాడెట్‌లతో కలిసి 2 నిమిషాల్లో 12 నృత్య రూపాలను ప్రదర్శించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో ఇద్దరూ స్థానం సంపాదించారు. జనవరి 27న ఢిల్లీలో జరిగిన పిఎం ర్యాలీలో వారు పాల్గొని ఈ ఘనత సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, ఎన్‌సిసి ఎఎన్‌ఒ లెఫ్టినెంట్ డాక్టర్ రోహిణి కుసుమ, 4 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బలిందర్ సింగ్ అభినందించారు.

## ఆంధ్ర క్రికెట్ జట్టుకు ఎంపి అభినందనలు

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** విజయనగరంలో జరిగిన రంజీ ట్రోఫీలో రాజస్థాన్‌పై 6 వికెట్ల తేడాతో అద్భుతమైన విజయం సొంతం చేసుకున్న ఆంధ్ర క్రికెట్ జట్టును ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంపి కేశినేని శివనాథ్ అభినందించారు. ఈ మేరకు ఏసీఏ అధ్యక్షుడు ఎంపికేశినేని శివనాథ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్ర క్రికెట్ జట్టు సాధించిన ఈ అద్భుత విజయం ఎంతో సంతోషం కలిగించిందన్నారు. ఈ ఏడాది ఆరంభాన్ని గెలుపుతో ప్రారంభించటం చాలా ఆనందంగా ఉందన్నారు జట్టులోని ప్రతి ఒక్కరూ అద్భుతమైన తమ ప్రతిభ చూపించటంతో పాటు కృషి, నిబద్ధత ఈ విజయానికి కీలక కారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర క్రికెట్ జట్టుకు హృదయపూర్వక అభినందనలు చెప్పారు. ఈ మ్యాచ్‌లో విశేష ప్రతిభ కనబరిచి రెండు ఇన్నింగ్స్‌లో కలిపి పది వికెట్స్ తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన త్రిపురాణ విజయ్‌కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఆంధ్ర క్రికెట్ జట్టు తమ సత్తా చాటుతూ విజయాలు సాధించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలవాలని ఎసిఎ అధ్యక్షుడు ఎంపికేశినేని ఆకాంక్షించారు.

## మార్చి 25న లారీ డ్రైవర్ల చలో ఢిల్లీ

**ప్రజాశక్తి - వీరులపాడు :** మార్చి 25న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని లారీడ్రైవర్ అసోసియేషన్ నాయకులు సహదేవ రావు పిలుపునిచ్చారు. జుజ్జూరు మండల కేంద్రంలో ఇంద్రసేన లారీ డ్రైవర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం మండల ప్రజా పరిషత్ పాఠశాలలో శనివారం సాయంత్రం జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల సహదేవరావు మాట్లాడుతూ లారీడ్రైవర్ వర్కర్స్ అనేక ఇబ్బందులకు గురవుతున్నారని కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన చట్టాల వల్ల డ్రైవర్‌ల కుటుంబాలు చిన్నాభిన్నంగా అయ్యే పరిస్థితులు ఉన్నాయని అనుకోని ప్రమాదాలు జరిగితే డ్రైవర్లను బాధ్యులను చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కఠినమైన శిక్షలు అమలు చేస్తున్నారన్నారు. లైసెన్సులు రద్దు చేస్తున్నారని, చాలీచాలని వేతనాలతో ఏళ్ళ తరబడి పనిచేస్తున్నారని అన్నారు. లాభాలు ఓనర్స్‌కు, ప్రభుత్వానికి దక్కుతున్నాయి, ప్రమాదాలు జరిగితే నష్టపోయేది డ్రైవర్లేనని అన్నారు. డ్రైవర్లు అందరూ ఐక్యంగా ఉండి ఢిల్లీ కేంద్రంగా జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి లాల్ అహ్మద్ గౌస్ పాల్గొని మాట్లాడుతూ డ్రైవర్లు ఐక్యంగా ఉండాలన్నారు. తమ సమస్యలు పరిష్కారానికి, ఇంద్రసేన డ్రైవర్ అసోసియేషన్ నాయకులకు, కార్యకర్తలకు సిఐటియు అండగా ఉంటుందన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

## రెండో రోజు గుణదల మేరీమాత నవదిన ప్రార్థనలు

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** ప్రతి ఒక్కరిని ఆదరించే మాత మరియమాత అని ఆంధ్ర లయోలా కళాశాల రెక్టర్ పూదోట రాయప్పజాన్ తెలిపారు. శనివారం సాయంత్రం గుణదల కొండపై రెండోరోజు జరిగిన గుణదల మాత మహోత్సవాల నవదిన ప్రార్థనలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫాదర్ పూదోట రాయప్ప జాన్ యాత్రికులకు సందేశమిస్తూ దేవదూత మరియతల్లి వద్దకు అనుగ్రహ పరిపూర్ణరాలా నీకు శుభము కలుగును గాక! అని తెలియజేసినట్లు తెలిపారు. అంతట మరియమాత ఇదిగో ప్రభువు దాసిరాలను నీ మాట చొప్పున నాకు జరుగును గాక! అని చెప్పినప్పుడు మహాసాధ్వీమణి, కన్య మరియకు పరిశుద్ధత్మ ద్వారా ఉద్భవించిన తన కుమారుని కని, పెంచి మనకందించిన మాతృమూర్తి మరియమాత అని చెప్పారు. విజయవాడ కతోలిక పీఠం మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు మాట్లాడుతూ ఈ నెల 9, 10, 11 తేదీలలో మూడు రోజులపాటు జరిగే గుణదల లూర్దుమాత 101వ మహోత్సవాల ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అనంతరం పుణ్యక్షేత్రం ప్రధాన చర్చి నుండి లయోల రెక్టర్ ఫాదర్ పుదోట రాయప్ప జాన్, మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, వికర్ జనరల్ ఫాదర్ యం. గాబ్రియేలు, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు స్వామి, ఎస్ఎస్సి డైరెక్టర్ ఫాదర్ తోట సునీల్రాజు తదితర గురువులు 'దివ్యసత్ప్రసాద మందసంతో' యాత్రికులతో కలిసి కొండపై లూర్ధుమాత స్వరూపం వద్దకు చేరుకుని, గురువులు సమిష్టి దివ్య పూజబలి' సమర్పించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఫాదర్ కొలకాని మరియన్న ఫాదర్ తోట సునీల్ రాజు పుణ్యక్షేదం సహాయ గురువులు బి.వినయ్, గోరి బాలసాని, ప్రస్ తదితర గురువులు, మఠకన్యలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఆరోగ్యానికి భరోసాగా ప్రకృతి వ్యవసాయం

**కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :** సాగులో పెట్టుబడి వ్యయం తగ్గించి, ఆదాయం పెంచే లక్ష్యంతో పొలం పిలుస్తోంది పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమంతో రైతులను చేయిపట్టి నడిపిస్తోం దని, ఆరోగ్యానికి భరోసా కల్పించే ప్రకృతి వ్యవసాయం దిశగా ముందడుగు వేయాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. దాములూరులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ బుధవారం పాల్గొన్నారు. ప్రస్తుతం వ్యవసాయం పరిస్థితి, సాగుచేస్తున్న పంటలు, ఉపయోగిస్తున్న ఎరువులు, వాటి లభ్యత తదితర వివరాలు రైతులను అడిగారు. తాము సాగు చేస్తున్న శనగ పంట (జేజీ–11) రకం ఎండిపోయి, దిగుబడి చాలా తగ్గిపోతోందని, ఈ నేపథ్యంలో పంట మార్పిడికి నీటి వసతిని దాములూరు పంపింగ్ స్కీమ్ ద్వారా అందించగలిగితే మొక్కజొన్న, జొన్న వంటి పంటలు వేసుకునేందుకు వీలవుతుందని రైతులు అన్నారు. కర్నూలు ఆధోని శనగ రకం (ఎన్‌బీఈజీ 452) అందించాల్సిందిగా కోరారు. పశుసంవర్ధక శాఖ ద్వారా పశు గ్రాసం పెంపకం, గోకులం షెడ్స్, కిసాన్ క్రెడిట్ కార్డు, పశువైద్య శిబిరాల గురించి డాక్టర్ శైలు మాధురి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని, వాటి పరిష్కారానికి ప్రణాళికాయుత చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా అగ్రి కనెక్ట్ కార్యక్రమం ద్వారా పాఠశాల విద్యార్థులను పొలానికి తీసుకెళ్లి ఇప్పటినుంచే నేల, పంటలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని, ఇందులో భాగంగా బుధవారం దాములూరు ఎంపీయూపీ స్కూల్ 8వ తరగతి విద్యార్థులను పొలానికి తీసుకెళ్లి శనగ పంటను చూపించినట్లు వివరించారు. గ్రామ సర్పంచ్ సిహెచ్.మధుసూదనరావు, మండల వ్యవసాయ అధికారి డి.శైలజ, గ్రామ వ్యవసాయ సహాయకుడు బి.నరేంద్ర కుమార్ నాయక్, గ్రామ రైతులు హాజరయ్యారు.

దాములూరులో పర్యటిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

## తలనొప్పి పట్ల నిర్లక్ష్యం వద్దు: డాక్టర్ సమరం

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** 'తలనొప్పే కదా అని తేలికగా తీసిపారేయలేమని, నిద్ర లేకపోవడం వల్ల, టెన్షన్ వల్ల వచ్చే తేలికపాటి తలనొప్పులతో పాటు మెదడులో కంతులు, మెదడువాపు వల్ల వచ్చే తలనొప్పులు వంటివి కూడా ఉంటాయని ప్రముఖ వైద్యులు డాక్టర్ సమరం పేర్కొన్నారు. వాసవ్య నర్సింగ్ హోమ్‌లో శ్రీ రవికుమార్ అధ్యక్షతన శనివారం జరిగిన ఆరోగ్య నదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని 'తలనొప్పి' అంశంపై సవివరంగా ప్రసంగించారు. ఆయన ఇంకా మాట్లాడుతూ తలనొప్పి అనేది చిన్నా–పెద్దా, ఆడ–మగా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ వస్తుందన్నారు. నిద్రలేమి, మానసిక వత్తిడి వల్ల కూడా తలనొప్పి వస్తుందన్నారు. సుగరు వ్యాధి ఉన్నవాళ్ళల్లో హైపోగ్లైసీమియా రావడం వల్ల, రక్తపోటు రోగుల్లో రక్తపోటు పెరగడం వల్ల, గర్భిణీ స్త్రీలల్లో హార్మోన్ల అస్తవ్యస్తత వల్ల తలనొప్పి వస్తుందన్నారు. సర్వైకల్ స్పాండిలోసిస్ ఉన్నవాళ్ళల్లో మెడ బాధ వల్ల తల వెనుక నొప్పి వస్తుందన్నారు. వెరైగో ఉన్నవాళ్లల్లో కొందరికి రోజు ఉదయం లేస్తూనే నొప్పి రావచ్చన్నారు. మరికొందరికి అప్పుడప్పుడు వస్తుందన్నారు. తలనొప్పి ఉన్నవాళ్ళు డాక్టరుకి చూపించుకుని చికిత్స పొందడం అవసరం అన్నారు. తలనొప్పి నిర్ధారణలో అవసరమైనవారికి ఎక్సరే, సీ.టి.స్కాన్, యం.ఆర్.ఐ. రక్తపరీక్షలు చేయాలన్నారు. పలువురు ప్రశ్నలడిగి సందేహ నివత్తి చేసుకున్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ సమరం

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.